నవతెలంగాణ
ఆదిలాబాద్
1
గురువారం | జనవరి 11, 2024 | www.navatelangana.com

చైనా మాంజా వాడితే చర్యలు

కాసిపేట: చైనా మాంజా వాడితే చర్యలు తీసుకోవడం జరుగుతుందని డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ ప్రవీణ్ నాయక్ హెచ్చరించారు. బుధవారం కాసిపేట మండలంలోని కొండాపూర్ యాపలో ఫారెస్ట్ రేంజర్ సుభాశ్ ఆదేశాలతో పతంగులు అమ్మకపు షాపుల్లో ఫారెస్ట్ అధికారులు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ రేంజర్ ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ చైనా మాంజ వలన పక్షులకు, మనుషులకు ప్రాణహాని జరిగే అవకాశం ఉందని, చైనా మాంజా మెడకు కోసుకొని మంచిర్యాలలో చనిపోయిన సంఘటనలున్నాయని అవగాహన కల్పించారు. గాలిపటాల విక్రయదారులు సాధారణ దారం అమ్మాలని, నిషేదిత చైనా మాంజాని అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీలో ఎఫ్బీవోలు కుమార స్వామి, సురేశ్ పాల్గొన్నారు.



భూసేకరణ సమస్యలపై సమీక్షా సమావేశం

మందమర్రి : పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ సమస్యలపై మంచిర్యాల అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయం లో బుధవారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ మనోహర్, శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు మందమర్రి, జైపూర్, తహసీల్దార్లతో సమీక్షించారు. ఈ సమావేశంలో సింగరేణిలో ఉన్న ఆర్అండ్ఆర్, భూ సేకరణ సమస్యలపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న ఆర్అండ్ఆర్ భూసేకరణ సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



గత ప్రభుత్వం పనిభారం మోపింది

- ఐఎన్టీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహమూద్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గత ప్రభుత్వం ఆర్టీసీలో కార్మిక సంఘాల ప్రమేయం లేకుండా చేసి కార్మికులపై అదనపు పనిభారం మోపిందని ఐఎన్టీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ మహమూద్ అన్నారు. బుధవారం యాదవ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన ఐఎన్టీయూసీ అనుబంధ ఎస్‌డబ్ల్యూయూ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖాళీలను భర్తీ చేయకుండా కార్మికులపై పని భారం మోపిందన్నారు. కార్మికుల డబ్బులను గత ప్రభుత్వం వాడుకుందని ఆరోపించారు. కార్మికుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించడం జరిగిందన్నారు. డీఏ, బాండ్, నిధులు రీకవరి తదితర అంశాలను దశల వారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. గత ప్రభుత్వం ఆర్టీసీలో సంఘాలు లేకుండా చేసిందన్నారు. హక్కుల సాధనలో సంఘాలే కీలకంగా ఉంటాయన్నారు. నూతన ప్రభుత్వంలో కార్మికులకు అంతా మంచి జరుగుతుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు అబ్రహం, గోపాల్, రాజారెడ్డి, సాయిరెడ్డి, యాదన్న, రమణ, రమేష్ పాల్గొన్నారు.

మినిమం టైం స్కేల్ ఇవ్వాలని మంత్రికి వినతి



నవతెలంగాణ-నిర్మల్

సమగ్ర శిక్షలో పనిచేస్తున్న వివిధ విభాగాల ఉద్యోగులందరికీ మినిమం టైం స్కేల్ ప్రకటించాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం ఆర్ అండ్ బీ భవనంలో రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షుడు భూసారపు గంగాధర్, ప్రధాన కార్యదర్శి రత్నం మాట్లాడారు. గత సంవత్సరం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని అంతవరకు విద్యాశాఖలో విలీనం చేసి మినిమం టైం స్కేల్ ఇవ్వాలని 25 రోజులపాటు చేసిన రిలే నిరాహార దీక్షలకు సీతక్క వచ్చి మద్దతు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే గత ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ ఇచ్చి సమస్యలను పరిష్కరిస్తామని గతంలో ఇచ్చిన హామీ మేరకు వాటిని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చేలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో జేఏసీ నాయకులు, వనిత, నాగలక్ష్మి, సుధాకర్, గజేందర్, విమల, వివేక్, గంగన్న, వెంకటరావు, శ్రీనివాసచారి, నారాయణ, రాజు పాల్గొన్నారు.

అనుమతిలేని పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- అదనపు కలెక్టర్‌కు పీడీఎస్‌యూ వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలో అనుమతులు లేకుండా నడిపిస్తున్న రోసోనెన్స్ అకాడమీ పాఠశాల యాజమాన్యంపై చట్ట ప్రకారంగా చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం అదనపు కలెక్టర్ శ్యామలదేవిని కలిసి వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం ర్యాంకుల పేరుతో విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తూ వాళ్ళ జీవితాలతో చెలగాటం ఆడుతున్నా కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చేయాలన్నారు. జిల్లాలో ఉన్నటువంటి కార్పొరేట్ విద్యాసంస్థలు అనుమతి లేకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కేవలం ఫీజుల దోపిడీ చేయడం లక్ష్యంగా నడుస్తున్నయని అన్నారు. ఒకటి, రెండు ర్యాంకులను చూపిస్తూ, ఫ్లెక్సీలతో, కరపత్రాలతో మైమరిపిస్తు విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని అన్నారు. విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం సరైనది కాదన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, విద్యార్థులను ప్రభుత్వ విద్యాసంస్థలలో చేర్పించి బలోపేతం చేయలన్నారు. తక్షణమే విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రయివేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో కొనసాగుతున్న ఫీజుల దోపిడిని అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అశోక్ వినోద్ ఉన్నారు.

అవినీతికి అంతమెక్కడా..?

ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలను లబ్ధిదారులకు చేకూర్చడంలో ఆయా ప్రభుత్వశాఖలదే ప్రముఖ పాత్ర. ప్రజా సమస్యల పరిష్కరించడంలోనూ వారే కీలకం. ప్రజల్లోనూ అధికారుల పట్ల గౌరవభావం ఉంటుంది. కానీ కొందరు అధికారులు, ఉద్యోగుల తీరు కారణంగా అప్రతిష్ట పాలు కావాల్సి వస్తోంది. ప్రభుత్వం నుంచి నెలనెలా వచ్చే జీతం కాకుండా..అదనంగా అమ్యామ్యాలకు అలవాటు పడి అవినీతి నిరోధకశాఖ అధికారులకు పట్టుబడుతున్నారు. సమాజంలో దోషులుగా ముద్ర వేసుకుంటున్నారు. వీరి లంచాల ఆశ కారణంగా రైతులు, సామాన్యులు చితికిపోతున్నారు. ప్రతి చిన్న సమస్యను పరిష్కరించుకోవాలంటే ఎంతో కొంత ముట్టజెప్పాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబ్బులు ఇవ్వకపోతే పనులు కావనే అభిప్రాయం ఉండటంతో గత్యంతరం లేక ముడుపులు ఇచ్చుకోవాల్సి వస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోపక్క 2020 నుంచి ఇప్పటి వరకు ప్రతి ఏటా ఏదో ఒక శాఖ అధికారులు అవినీతి నిరోధకశాఖ అధికారులకు పట్టుబడుతుండటం ఉమ్మడి జిల్లాలో లంచాల పర్వం పెరిగిపోతుందనడానికి ఉదాహరణగా నిలుస్తోంది.

- ప్రభుత్వశాఖల్లో పెరుగుతున్న లంచాల పర్వం
- కొందరు అధికారులు, ఉద్యోగుల తీరుతో అప్రతిష్ట
- డబ్బులు ఇవ్వలేక చితికిపోతున్న రైతులు, సామాన్యులు
- తాజాగా ఏసీబీకి చిక్కిన కడెం తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్
- ఉమ్మడి జిల్లాలో ఏటా పట్టుబడుతున్న అక్రమార్కులు



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వశాఖల్లో లంచాల పర్వం కలకలం రేపుతోంది. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు వారు చేసే పనులకు సర్కారు ప్రతి నెలా రూ.లక్షల్లో జీతం అందిస్తోంది. కొందరు అధికారులు సేవాభావం, నిజాయితీగా వ్యవహరిస్తూ పేదలకు ఆయా పథకాలు దరిచేర్చడం, వారి సమస్యలను పరిష్కరించడంలో ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలోని వేలాది మంది పేదలకు లబ్ధి చేకూరుతోంది. కానీ కొందరు అధికారులు, ఉద్యోగులు మాత్రం అదనంగా వచ్చే లంచాలకు అలవాటు పడి అప్రతిష్టను మూటగట్టుకుంటున్నారు. రైతులు, సామాన్యులు వివిధ సమస్యలను పరిష్కరించాలని కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ప్రాధేయపడుతున్నారు. చిన్న చిన్న సమస్యలను కూడా పరిష్కరించకుండా వివిధ రకాల కొర్రీలు పెడుతూ వారి చుట్టూ తిప్పుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఆయా పనులు సకాలంలో పరిష్కారం కావాలంటే ఎంతో కొంత ముట్టజెప్పాలని బేరసారాలకు దిగుతూ రైతులు, సామాన్యులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితిలో పేదలు అధికారులకు లంచాలు ఇస్తూ సమస్యను పరిష్కరించుకుంటున్నారనే అభిప్రాయం ఉంది. కొందరు వ్యక్తులు మాత్రం లంచాలు ఇవ్వలేక అవినీతి నిరోధక శాఖ అధికారులను సంప్రదిస్తున్నారు. ఏసీబీ అధికారుల వేసిన వలలో పడుతున్న అవినీతి అధికారులు,ఉద్యోగులు కటకటాలు లెక్కిస్తున్నారు. తాజాగా కడెం మండలం కొత్తమద్దిపడగ గ్రామానికి చెందిన రైతు లాసెట్టి రాజన్న భూమి రిజిస్ట్రేషన్ కోసం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. రిజిస్ట్రేషన్ కావాలంటే రూ.15వేలు లంచం ఇవ్వాలని తహసీల్దార్ చెప్పడంతో రూ.9వేలకు బేరం ఒప్పందం కుదిరింది. బుధవారం సదరు రైతు కార్యాలయానికి వెళ్లి డిప్యూటీ తహసీల్దార్‌కు డబ్బులు ఇవ్వగా.. అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు తహసీల్దార్ రాజేశ్వరి, డిప్యూటీ తహసీల్దార్ చిన్నయ్యలను పట్టుకున్నారు. ఇలాంటి ఉదంతాలు ఉమ్మడి జిల్లాలో ప్రతి ఏటా జరుగుతుండటంతో లంచాల పర్వం ఏ మేరకు సాగుతుందో అర్థమవుతోంది.

మచ్చుకు కొన్ని ఉదాహరణలు

- జిల్లాలో 2020 ఏడాదిలో ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి గ్రామానికి చెందిన ఓ గుత్తేదారు రూ.5లక్షల విలువైన సీసీ రోడ్లు వేయగా.. ఆ బిల్లుకు జారీకి ఉప గణాంక అధికారి ఇబ్బందులకు గురిచేయడంతో సదరు గుత్తేదారు ఏసీబీని ఆశ్రయించాడు.
- 2020 ఏడాదిలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులు ఏసీబీకి పట్టుబడ్డారు. పట్టణంలోని భుక్తాపూర్‌కు చెందిన ఓ వ్యక్తిని రూ.15వేలు లంచం అడగ్గా..బాధితుడు ఏసీబీని ఆశ్రయించారు. దీంతో ఏసీబీ అధికారులు వారిని పట్టుకున్నారు.
- కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 2023 ఏడాదిలో చింతలమానేపల్లి ఎస్ఐ, హోంగార్డు రూ.20వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. ఓ మహిళ తప్పిపోయిన కేసులో నిందితురాలిగా ఉన్న వ్యక్తి పేరును మినహాయించడంతో పాటు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్ తిరిగి ఇచ్చే ప్రయత్నంలో ఫిర్యాదుదారు నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు.
- నిర్మల్ జిల్లా కేంద్రంలో 2023లో సబ్ రిజిస్టర్ కార్యాలయంలో లంచం తీసుకుంటూ ఇద్దరు ఉద్యోగులు పట్టుబడ్డారు. నర్సాపూర్ (జి) మండలానికి చెందిన ఓ వ్యక్తి గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి వెళ్లగా సదరు అధికారులు రూ.8వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించగా సదరు అధికారులు పట్టుబడ్డారు.
- ఆదిలాబాద్ జిల్లాలో 2023 ఏడాదిలో మావల తహసీల్దార్ కార్యాలయంలో పట్టాపాస్‌బుక్‌లో వివరాలు సరిచేసేందుకు లంచం తీసుకున్న ఇద్దరు అవినీతి అధికారులు ఏసీబీకి పట్టుబడ్డారు. తహసీల్దార్, ఆర్ఐ రూ.2లక్షలు తీసుకోగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

- దోపిడీ విధానాలకు బీజేపీ అనుకూలం
- కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి
- పోడు భూములన్నింటికీ పట్టాలు అందించాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌టౌన్



ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకపోవడంతో పాటు నియంతృత్వ ధోరణి అవలంభించడంతో ఎన్నికల్లో ఓడిపోయిందని తెలిపారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలైన ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో బుధవారం నిర్వహించిన పార్టీ ప్లీనం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు పార్టీ సీనియర్ నాయకుడు బండి దత్తాత్రి పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దోపిడి విధానాలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్మికులు, కర్షకుల హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. దేశంలో కొద్ది మంది దగ్గరే సంపద పోగు కావడంతో నిరుద్యోగం, దారిద్ర్యం పెరుగుతోందని, పేదరికం పోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులపై దాడులు జరుగుతున్నాయని ఏడాదికి వెయ్యి మంది హత్యకు గురవుతున్నారని పేర్కొన్నారు. దేశంలో అనేక దారుణాలు కొనసాగుతున్నాయని చెప్పారు. గతంలో కాంగ్రెస్ భూస్వామ్య, పెట్టుబడిదారీ విధానాలు అవలంభించిందని..ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం అంతకుమించి వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పెట్టుబడిదారులు, డబ్బులు ఉన్న వారికి అనుకూలంగా వ్యవహరిస్తోందని తెలిపారు. నిత్యావసర ధరలు తగ్గించడానికి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని..30శాతం రక్తహీనతతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆకలిసూచిలో భారతదేశం 111స్థానంలో ఉందని, ఉపాధిహామీ నిధులను రూ.90వేల కోట్ల నుంచి రూ.60వేల కోట్లకు తగ్గించిందని పేర్కొన్నారు.

సీఎంను కలిసి విన్నవించాం

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసినట్లు పేర్కొన్నారు. గత సర్కారు 13లక్షల ఎకరాల పోడు భూములకు గాను కేవలం 3లక్షల ఎకరాలకు పట్టాలు పంపిణీ చేసిందని గుర్తుచేశారు. మిగిలిన వాటికి పట్టాలు అందించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేయడంతో పాటు ఉద్యోగాలు భర్తీ చేయాలని, రాష్ట్రంలో 30లక్షల కుటుంబాలకు ఇండ్లు లేవని గుర్తించామని, సీపీఎం ఆధ్వర్యంలోనే లక్ష కుటుంబాలు గుడిసెలు వేసుకొని జీవిస్తున్నాయని ఇలాంటి వారందరికీ ఇంటి పట్టాలు అందించడంతో పాటు ఇంటి నిర్మాణం చేపట్టాలని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం కార్మికుల పట్ల నిరంకుశంగా వ్యవహరించిందని తాజాగా ఏర్పడిన ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. అనంతరం పలు తీర్మానాలు ప్రవేశపెట్టారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి బండారు రవికుమార్, జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, పార్టీ కార్యదర్శివర్గ సభ్యుడు లంకా రాఘవులు, సీనియర్ నాయకుడు బండి దత్తాత్రి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, మంజుల, సురేందర్, నాయకులు శకుంతల, జమున తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలి

- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్



నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కమిషనర్ ఆర్వీ. కర్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్ పాయ్‌లతో కలిసి ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలన్నారు. ఆస్పత్రుల్లో అవసరమైన వైద్యులు, సిబ్బందిని నియమకం, అవసరమైన సామాగ్రిని సమకూర్చుకోవాలని సూచించారు. ప్రధాన మంత్రి జన్ జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం- జన్మన్) కార్యక్రమంలో భాగంగా ప్రతి పీవీటీజీ కుటుంబాలకు ఆరోగ్య శ్రీ, ఆయుష్మాన్ భరత్ పథకాలను అమలు చేయాలనీ ఆదేశించారు. ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వివిధ రకాల పరీక్షలు నిర్వహించాలన్నారు. కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ రిమ్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆస్పత్రుల వారిగా ప్రసవాలు, అందిస్తున్న వైద్య చికిత్సలపై సమీక్షించారు. అనంతరం కేబీ కాంప్లెక్ ప్రాంగణంలో అధికారులతో కలిసి కలెక్టర్ మొక్కను నాటి నీరు పోశారు. అనంతరం ఉట్నూర్ ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఎలాంటి తప్పులు లేకుండా దరఖాస్తుదారుల వివరాలను నమోదు చేయాలనీ అధికారులు, ఆపరేటర్‌లకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్త, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతో, ఆదిలాబాదు, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల వైద్యారోగ్య శాఖ అధికారులు, వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

టీహబ్ పనులన పరిశీలన..

గిరిజనులకు మరింత మెరుగైన ప్రభుత్వ వైద్యం అందించలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆస్పత్రుల్లో సౌకర్యాలు కల్పిస్తుందని హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. బుధవారం ఉట్నూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. ముందుగా నిర్మాణంలో ఉన్న తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్ పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడుతూ పురోగతిని తెలుసుకున్నారు. ఆస్పత్రిలో రోగులతో మాట్లాడి అందుతున్న వైద్యం గురించి తెలుసుకున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా వైద్య శిబిరాలు నిర్వహించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్‌ను ఆదేశించారు. రెండు నెలల్లో తెలంగాణ గయాగ్నోస్టిక్ పనులు పూర్తై వినియోగంలోకి వస్తుందన్నారు. అదే విధంగా ఆశ వర్కర్లు గర్భిణులకు నెలనెల వైద్య చికిత్సలు అందించే విధంగా చూడాలన్నారు. వారి వివరాలను వారి వద్ద ఉండాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేల అవగాహన కల్పించాలన్నారు. అదే విధంగా ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వైద్యులు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని ఆదేశించారు. ఉట్నూర్‌కు వచ్చిన ఆయనకు ఉద్యోగులు, సిబ్బంది పూల మొక్కను అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మహేందర్, కపిల్, అనురాధ, సిబ్బంది ఉన్నారు.

పులుల మృతిపై కొనసాగుతున్న విచారణ

- అదుపులో నలుగురు వ్యక్తులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మండలంలోని దరిగాం అటవీ ప్రాంతంలో రెండు పులుల మృత్యువాత పడిన సంఘటన జాతీయ స్థాయిలో సంచలనం రేపింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంతో పురోభివృద్ధి చెందినప్పటికీ గుట్టుచప్పుడు కాకుండా పులులు హత్యకు గురికావడంపై పలు భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పులుల రక్షణకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినప్పటికీ వేటగాళ్ల బారి నుంచి కాపాడలేకపోయారు. ఈ నెల 6న దరిగాం శివారులో మృత్యువాత పడిన కే 15 పులికి 150 మీటర్ల దూరంలోనే ఎస్ 9 పులి కళేబరం లబించడం టైగర్ ట్రాకింగ్ పార్టీ ఏ మేరకు పనిచేస్తుందో ఈ ఘటనే తెలియజేస్తోంది. ఇదంతా పశువుల కాపర్లు సమాచారం ఇచ్చేంతవరకు అటవీ అధికారులకు తెలియకపోవడం గమనార్హం. టైగర్ ట్రాకింగ్ పార్టీని ఔట్సోర్సింగ్ విధానంలో సిబ్బందిని ఏర్పాటు చేసిన అటవీశాఖ కనీసం వారికి సకాలంలో జీతాలు కూడా అందించడంలేదు. ఇందుకుతోడు డివిజన్, జిల్లా స్థాయి అధికారులు కాగజ్‌నగర్‌లో మకాం వేసి సమావేశం నిర్వహించడం తప్పా క్షేత్రస్థాయిలోకి వెళ్లిన దాఖలాలులేవు. ఈ డివిజన్ పరిధిలో సంచరించే పులులు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైనప్పుడు ఇక్కడ ఉన్నాయని చెప్పడం కెమెరాల్లో చిక్కనప్పుడు మహారాష్ట్రకు వెళ్లిపోయాయని అధికారులు చెప్పడం మినహా వాటి విషయంలో వాస్తవ పరిస్థితిని తెలుసుకోకపోవడం అధికారుల వైఫల్యానికి ఈ రెండు పులుల సంఘటనే నిదర్శనం. పులుల మృతిపై అటవీశాఖ, పోలీసుశాఖ బుధవారం దర్యాప్తు ముమ్మరం చేసింది. చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు అధికారి శాంతారాం, జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్‌లు బుధవారం దరిగాం అటవీప్రాంతంలో విచారణ చేపట్టారు. ఫారెస్టు అధికారులతో కూడిన 15 జట్లను ఏర్పాటు చేశారు. ఒక్కో జట్టులో ఐదుగురు సభ్యులను ఏర్పాటు చేశారు. 20 నుంచి 30 ఆధునిక టెక్నాలజీతో కెమెరాలను ఏర్పాటు చేశారు. పలువురు గడ్డిమందు చల్లి పులులను హతమార్చాలని ప్రయత్నించినట్టుగా తెలుస్తోంది. పులిపై విష ప్రయోగం చేసి పులి మృతికి కారణమైన వాంకిడి మండలం సర్కెపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు, కాగజ్‌నగర్ మండలం దరిగాంకు చెందిన ఇద్దరు వ్యక్తులను బుధవారం అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్టుగా తెలుస్తోంది. ప్రాథమికంగా గడ్డి మందు విషప్రయోగం చేసినట్లు పోలీసుశాఖ విచారణలో నింధితులు ఒప్పుకున్నట్టు సమాచారం.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్-నిర్మల్

2

గురువారం | జనవరి 11, 2024 | www.navatelangana.com

ఎమ్మెల్యేను సన్మానించిన గౌడ సంఘం నాయకులు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

నిర్మల్ నియోజకవర్గ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని ఆయన నివాసంలో బుధవారం మండల గౌడ సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గౌడ సంఘ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మల్, ముధోల్ ఎమ్మెల్యేలు రామారావు పటేల్, మహేశ్వర్‌రెడ్డిలని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రవీందర్‌గౌడ్, అంజగౌడ్, రాజా గౌడ్, బాబు గౌడ్, దశగౌడ్, రాకేష్‌గౌడ్, రాజుగౌడ్, రామగౌడ్, రంజిత్ గౌడ్, మోహన్ గౌడ్ పాల్గొన్నారు.



గిన్నిస్ రికార్డు సాధించిన కళాకారులకు అభినందనలు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని చామన్‌పల్లి గ్రామానికి చెందిన ఏలేటి అంజలిరెడ్డి గిన్నిస్ రికార్డు కొరకు భారత్ ఆర్ట్స్ అకాడమీ, ఏబీసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 24వ తేదీన 700 మందికి పైగా నృత్య కళాకారులచే ప్రదర్శన నిర్వహించి, గిన్నిస్ రికార్డు సాధించారు. ఈ సందర్భంగా నృత్య కళాకారులు ఏలేటి అంజలిరెడ్డి, నృత్యమాల నాట్య అకాడమీ బృందాన్ని బుధవారం నిర్మల్ నియోజకవర్గ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అభినందనలు తెలుపుతూ, ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అంజలిరెడ్డిని లక్ష్మణచాంద సర్పంచ్ సురకంటి ముత్యం రెడ్డి, చామన్‌పల్లి గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.



విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తా



నవతెలంగాణ-తాంసి

విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం భీంపూర్ మండల కేంద్రంలో నూతనంగా రూ.31లక్షల నిధులతో నిర్మించిన మండల విద్యావనరుల కేంద్రాన్ని ఎంపీపీ, జెడ్పీటీసీలతో కలిసి ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యేను మండల విద్యాధికారితో పాటు మండల నాయకులు పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాలను సందర్శించి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, ప్రతిరోజు నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని అన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భోజనాన్ని అందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందన్నారు. అలాగే విద్యావ్యవస్థ అభివృద్ధి చెందుతేనే అన్ని విధాల అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందన్నారు. పాఠశాలలో అన్ని వసతులు కల్పించడానికి నా వంతు కృషి చేస్తానని అన్నారు. నాకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించిన మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లింబాజీ, ఎంపీపీ రత్నప్రభ సంతోష్, జెడ్పీటీసీ సుధాకర్, వైస్ ఎంపీపీ లక్ష్మణ్, కన్వీనర్ నాగయ్య, మండల నాయకులు అనిల్, అఫ్రోజ్, గోవర్ధన్ యాదవ్, సంజీవరెడ్డి, ఎంఈఓ శ్రీకాంత్ ఉన్నారు.

సాదాసీదాగా జెడ్పీ సర్వసభ్య సమావేశం



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం స్థానిక దివ్యాగార్డెన్‌లో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీ అధ్యక్షతన సాదా సీదాగా కొనసాగింది. ముందుగా ఎజెండా అంశాల ప్రతిని సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా విద్యా, వైద్యం, తాగునీటి సరఫరా, వ్యవసాయం, ఉపాధిహామీ పనులు, దళితబంధు పథకం, గ్రామీణాభివృద్ధి, ఇతర శాఖల వారి పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. పలువురు సభ్యులు లేవనెత్తిన పలు అభివృద్ధి సంక్షేమ పథకాల సమస్యలపై కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కొరకు పకడ్బందీ చర్యలు చేపడతామని తెలిపారు. జడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ అన్ని రంగాలలో ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పథంలో జిల్లాను ముందు వరుసలో ఉండేలా సమిష్టిగా కృషి చేయాలని కోరారు. అనంతరం చైర్‌పర్సన్ జిల్లా కలెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జెడ్పీ సీఈఓ సుధీర్, జిల్లా అధికారులు, జెడ్పీటీసీ, ఎంపీపీలు కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

పల్సిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-కుభీర్

పల్సిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని బుధవారం మంత్రి దినసరి అనసూయ (సీతక్క)కు వినతిపత్రాన్ని అందజేశారు. పల్సి గ్రామాన్ని గత కొన్ని సంవత్సరాలుగా మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు మండల అధికారులకు, నాయకులకు విన్నవించుకున్నారు. మండల కేంద్రంగా ఏర్పాటుకు అవసరమైన అన్ని సౌకర్యాలు, ప్రభుత్వ స్థలం, మార్కెట్ వ్యవస్థతో పాటు అన్ని సౌకర్యలు ఉన్నాయని అన్నారు. మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు విలాస్ పటేల్ మర్యాదపూర్వకంగా కలిసి మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించి, తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట గ్రామస్తులు, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు రాములు ఉన్నారు.

విద్యార్థులకు శాపంగా వసతి గృహాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గత ప్రభుత్వ నిర్లక్ష్యమో, అధికారుల పర్యవేక్షణ లోపమో తెలియదు కానీ ఆశ్రమ పాఠశాల వసతి గృహాల విద్యార్థులకు శాపంగా మారుతుందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని కొలం ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. ముందుగా విద్యార్థులకు అందిస్తున్న భోజన మెనూను పరిశీలించి వివరాలు అడిగారు. సిబ్బంది కొరత ఉందని, యూనిఫాం, దుప్పట్లు రాలేదని, విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కొంత మంది సిబ్బంది తమకు ఆరు నెలలుగా వేతనాలు లేవని, చెల్లించే విధంగా ఆయనను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం తప్పిదం కారణంగా సాంఘీక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. 2022లో రావాల్సిన యూనిఫాంలు 2023లో, 2023లో రావాల్సినవి 2024లో అందించారన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా చలి ఆదిలాబాద్‌లోనే నమోదవుతుందని అన్నారు. కానీ ఇప్పటివరకు విద్యార్థులకు దుప్పట్లు కూడా రాలేదన్నారు. చలిలోనే చల్లటి నీటితో స్నానాలు చేయాల్సిన దుస్థితి ఉందన్నారు. సరైన వసతులు, సౌకర్యాలు లేకపోవడంతో వారి చదువుపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. పేదల సమస్యలు తెలిసిన వ్యక్తి మంత్రి సీతక్క దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జోగు రవి, రాకేష్, సూర్య మోహన్, ఉపాధ్యాయులు ఉన్నారు.

భైంసా ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికకు షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ-భైంసా

ఈ నెల 12న భైంసా ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికకు సంబంధించిన షెడ్యూల్‌ను బుధవారం విడుదల చేశారు. భైంసా ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 12న ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎమ్మెల్యేగా పవార్ రామారావు పటేల్ ఎన్నిక కావడంతో మండలంలో రాజకీయ సమీకరణాలు మారిపోయాయి. గతంలో ఒకే ఒక ఓటుతో ఎంపీపీ, వైస్ ఎంపీపీ స్థానాన్ని బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుంది. బీఆర్ఎస్‌కు 5స్థానాలు, కాంగ్రెస్ 4స్థానాలు, బీజేపీకి 2స్థానాలు కైవసం చేసుకోగా ఒకరిద్దరు మినహా ప్రస్తుతం ఎంపీటీసీ లంతా బీజేపీ పక్షాన ఉన్నారు. ఎంపీపీ కల్పన, వైస్ ఎంపీపీ గంగాధర్ రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. ఎన్నికల అధికారి క్రాంతికుమార్ సమక్షంలో ఈ నెల 12న శుక్రవారం ఎన్నిక జరగనుంది. ఎంపీపీగా మీర్జాపూర్ ఎంపీటీసీ అబ్దుల్ రజాక్, వైస్ ఎంపీపీగా నర్సారెడ్డి ఎన్నిక కానున్నారు. దీంతో భైంసా ఎంపీపీ పీఠం బీజేపీ కైవసం చేసుకోనుంది.

మంత్రిని కలిసిన సర్దార్

నవతెలంగాణ-ముధోల్

తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ముధోల్ నియోజకవర్గం టీజేఎస్ ఇన్‌చార్జి సర్దార్ వినోద్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ముధోల్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై విన్నవించారు.

సీసీఐ తెరిచాకే బీజేపీ ఓట్లు అడగాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవి కుమార్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్‌కే తలమానికంగా ఉన్న సీసీఐ (సిమెంట్ ఫ్యాక్టరీ) వచ్చే పార్లమెంట్ ఎన్నికల నాటికీ తెరిచి, బీజేపీ ఎన్నికల్లో ఓట్లు అడగాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవి కుమార్ అన్నారు. బుధవారం సీసీఐని పునరుద్ధరణ చేయాలనీ డిమాండ్ చేస్తూ, సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం ఎదుట రహదారిపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన ఎన్నికల్లో బీజేపీకి ఓటేసి ఎమ్మెల్యేగా గెలిపిస్తే, సీసీఐని ప్రారంభిస్తామని అమిత్‌షా హామీ ఇచ్చారని ఆ హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సీసీఐ పునరుద్ధరణకు ఎలాంటి చర్యలు తీసుకోక పోగ మళ్లీ పార్లమెంట్ ఎన్నికలలో ఓట్లు అడగడానికి రావడం సిగ్గుచేటన్నారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే, ఎంపీ రెండు బీజేపీ పార్టీ గెలిచిన ఆదిలాబాద్ ప్రజల అభివృద్ధి తొడ్పాడే సీసీఐ ఫ్యాక్టరీ పునరుద్ధరణ, ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వే లైన్, జిల్లా కేంద్రం లో విమానాశ్రయం ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఉన్నప్పుడు సీసీఐని మాకు అప్పగించండి మేము తెరిపిస్తామని కేసీఆర్, కేటీఆర్ హామినిచ్చినప్పటికి కేంద్రం స్పందించలేదన్నారు. ఇప్పుడు నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం సీసీఐ తెరిపించేందుకు ముందుకు రావాలన్నారు. వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి చేయాలన్నారు. ఎన్నో వనరులు కలిగి ఉన్న సద్వినియోగం చేసుకోవడం లేదని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతున్నాయని అన్నారు. సీసీఐ పునంప్రారంభంలో అనేక మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని అన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి కలిసి వచ్చే పార్టీలు ప్రజా సంఘాలతో సీపీఐ(ఎం) భవిష్యత్తులో పోరాటాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ ఐక్య పోరాటంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు కలిసి రావాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ, జిల్లా కార్యదర్శి మల్లేష్, జిల్లా నాయకులు లంక రాఘవులు, బండి దత్తాత్రి, పూసం సచిన్, కిరణ్, ఆశన్న, సురేందర్, గంగన్న, మంజుల పాల్గొన్నారు.



అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

- జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం
- మంత్రి సీతక్క



నవతెలంగాణ-నిర్మల్

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి సీతక్క అన్నారు. బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని రాజ రాజేశ్వర గార్డెన్‌లో కాంగ్రెస్ నిర్మల్ జిల్లా సమన్వయకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగాహాజరై మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లా అక్షర క్రమంలో ముందుండి, అభివృద్ధిలో మాత్రం వెనుకబడిందన్నారు. సరస్వతిదేవి కొలువైన ప్రాంతంలో ఎందరో మహనీయులు పుట్టిన ప్రాంతం ఆదిలాబాద్ అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు తనను ఇన్‌చార్జీగా నియమించడం తన అదృష్టమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఆదిలాబాద్ పై ఎంతో ప్రేమ ఉందన్నారు. సీఎం అయిన తర్వాత పర్యటన సైతం ఇక్కడినుండే మొదలుపెడతారన్నారు. హైదరాబాద్‌లో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, ఈ జిల్లాపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదేశించారని అన్నారు. ఓడిన అభ్యర్థులు సైతం ప్రజల్లో ఉండి వారి కష్ట, సుఖాలు తీర్చేందుకు ముందుండాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తే ఆటో సంఘాలతో ఆందోళన చేయించిన ఘనత బీఆర్ఎస్ దేనని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన రెండు రోజుల నుండే కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ దూషించడం మొదలుపెట్టిందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కష్టపడి కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలన్నారు. అంతకుముందు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సారూ.. ఇథనాల్ ఫ్యాక్టరీని తరలించాలి

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండలంలోని దిలావర్‌పూర్, గుండంపల్లి సరిహద్దు గ్రామాల పంటపొలాల్లో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ అక్కడి నుంచి తరలించాలని రైతులు, డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డిల ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఫ్యాక్టరీ వల్ల కలిగే దుష్ప్రభావాలను రైతులు సీఎంకు వివరించారు. ఫ్యాక్టరీ పరిసర గ్రామాల్లో ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా, నిరాధారమైన అనుమతి పత్రాలతో ఫ్యాక్టరీ నిర్మాణం చేపడుతున్నారని తెలియజేశారు. గ్రామాలకు దూరంగా, బంజరు భూముల్లో నిర్మించాల్సిన ఫ్యాక్టరీని పచ్చని పంట పొలాల్లో నిర్మిస్తున్నారని అన్నారు. ఫ్యాక్టరీ చుట్టుపక్కల నాలుగు వేయిల ఎకరాల సారవంతమైన పంట భూములు నిర్వీర్యమయ్యే అవకాశం ఉదని తెలిపారు. ఫ్యాక్టరీ గోదావరి నదికి కేవలం ఒక కిలోమీటర్ దూరంలో నిర్మిస్తున్నారని, ఫ్యాక్టరీ వ్యర్థపు నీటిని గోదావరిలో వదిలితే నదిలోని చేపలు కనుమరుగయ్యే అవకాశం ఉందని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా అందిస్తున్న తాగునీరు కలిషితమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గోదావరి నది తీరాల్లోగల ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలకు తీవ్ర జల కాలుష్య ప్రభావం ఏర్పడుతుందన్నారు. వాతావరణ కాలుష్యమై చుట్టుపక్కల దాదాపు ఇరువై కిలోమీటర్ల సమీప గ్రామాలు కాలుష్య కోరల్లో చిక్కుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఆరవై మంది రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన సీఎం ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా రైతులు చేస్తున్న ఉద్యమాలు, ఆందోళన కార్యక్రమాలు తమ దృష్టికి వచ్చాయని పేర్కొన్నారు. అనంతరం తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కోడె నవీన్, నడుకుడ సుఖేష్, పసుల పవన్, సప్పల నర్సయ్య, కొండ్ర రోహిత్ పాల్గొన్నారు.



లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకు ఉద్యమం



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహణ అధ్యక్షులు గోడం గణేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మావల మండల కేంద్రంలోని కుమురం భీం కాలనీలోని ఆదివాసీ కమ్యూనిటీ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ అర్బన్, మావల మండల కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట బద్ధతలేని లంబాడాలను ఎస్టీ జాబిత నుంచి తొలగించే వరకు రాజ్యాంగ బద్దంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 342ను విరుద్ధంగా చట్ట సభలో ఆమోదం లేని లంబాడాల వలన తెలంగాణ రాష్ట్ర రిజర్వేషన్‌లో ఆదివాసులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మా పోరాటానికి ప్రజా రాజకీయ న్యాయపోరాటాలను కలుపుకుంట శాస్త్రీయ పద్ధతిలో ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. తుడుం దెబ్బ ఆదిలాబాద్ పట్టణ కమిటీ, మావల మండల కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. పట్టణ అధ్యక్షులుగా మడావి డిగంబార్, కార్యనిర్వాణ అధ్యక్షులుగా అనక గంగారాం, మావల మండల అధ్యక్షులుగా ముకుంద్, ప్రధాన కార్యదర్శిగా పంద్రం గంభీర్, లను ఎన్నుకోవడం జరిగిందన్నారు. తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేష్, కుమ్ర శ్యామ్‌రావు, పూర్క బాపూరావు, తుడుం దెబ్బ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు వెట్టి మనోజ్, ప్రధాన కార్యదర్శి గేడం భారత్, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సలాం వరుణ్, కుమ్ర నాణేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సొయం లలిత భాయి, మహిళా సంఘం డివిజన్ అధ్యక్షురాలు మర్సకొల భారత్, డివిజన్ ఉపాధ్యక్షులు ఆత్రం గణపతి, డివిజన్ ఉపాధ్యక్షులు, డివిజన్ మండల కమిటీ సభ్యులు ఆదివాసీ పెద్దలు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన ఇద్దరు రెవెన్యూ అధికారులు



నవతెలంగాణ-కడెం

లంచం తీసుకుంటుండగా ఇద్దరు రెవెన్యూ అధికారులను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. బుధవారం నిర్మల్ జిల్లా, కడెం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామానికి చెందిన లాసెట్టి రాజన్న తన 35 గుంటల భూమి పట్టా కొరకు కడెం తహసీల్దార్‌ను సంప్రదించగా రూ.15వేలు లంచం ఇవ్వాలని తహసీల్ధార్ రాజేశ్వరీ డిమాండ్ చేశారు. దీంతో బాధిత రాజన్న తన వద్ద రూ.9వేలు మాత్రమే ఉన్నాయని, తహసీల్దారుతో బేరాలు ఆడి రూ.9 వేలకు బేరం కుదుర్చుకున్నాడు. బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో ఏసీబీ అధికారుల సలహాలు సూచనలతో సంబంధిత డబ్బులు ఎక్కడ ఇవ్వాలని తహసీల్దార్ రాజేశ్వరిని బాధితుడు అడగగా డిప్యూటీ తహసీల్దార్ చిన్నయ్యకు ఇవ్వమని సూచించడంతో సంబంధిత డబ్బులు డిప్యూటీ తహసీల్దార్ చిన్నయ్యకు ఇస్తుండగా, ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అవినీతికి పాల్పడిన తహసీల్దార్ డిప్యూటీ తహసీల్దార్‌ను కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్టు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు. అవినీతికి ఎవరు పాల్పడిన ఏసీబీని ఆశ్రయించాలని వారు సూచించారు.

అంగన్‌వాడీలపై ఆంధ్ర ప్రభుత్వ నిర్బంధాన్ని ఆపాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆంధ్రప్రదేశ్‌లో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు మద్దతుగా తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆదిలాబాద్ జిల్లా కమిటీగా సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ ప్లకార్డుల ప్రదర్శన నిర్వహించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయం ఎదుట ప్లకార్డులను పట్టుకొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలు చేస్తున్న న్యాయమైన డిమాండ్లను ఆంధ్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. అలాగే అంగన్‌వాడీలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెచ్చిన ఎస్మా నిర్బంధాన్ని ఈ ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. అలాగే అంగన్‌వాడీలతో చర్చలు జరిపి సమ్మె విరమించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ రాష్ట్ర అధ్యక్షురాలు కే.సునీత, సీఐటీయూ కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, ఉపాధ్యక్షులు, లింగాల చిన్నన్న, అంగన్‌వాడీ ఉపాధ్యక్షులు పార్వతి, అంగన్‌వాడీ నాయకులు, సుభద్ర, గంగమ్మ, రేణుక, కౌసల్య, పార్వతి, కళ్యాణి, ప్రేమల, శ్యామల, రత్న, నాయకులు పాల్గొన్నారు.

అన్ని క్రీడలకు అనుకూలంగా ఎన్టీఆర్ మినీ స్టేడియం

నవతెలంగాణ-నిర్మల్

అన్ని రకాల క్రీడలు ఆడేందుకు అనుకూలంగా ఎన్టీఆర్ మినీ స్టేడియాన్ని అభివృద్ధి చేసుకున్నామని మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. మొహమ్మద్ షరీఫ్ అలీ జ్ఞాపకార్థం నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో బుధవారం నిర్వహించిన క్రికెట్ పోటీల ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని టాస్ వేసి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. మున్సిపల్ చైర్మెన్‌ని ఆర్గనైజేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జట్టు సభ్యులందరి సమిష్టి కృషి వల్లే విజయం సాదించగలమని, ప్రతీ ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో ముందుకెళ్లలన్నారు. మున్ముందు పలు రకాల క్రీడాకారులకు సౌకర్యంగా ఉండేలా మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ టోర్నమెంట్ 10 రోజులు కొనసాగతుందని, మొత్తం 30 జట్లు పాల్గొంటున్నాయన్నారు. ప్రథమ బహుమతిగా రూ.20వేలు రన్నరప్‌గా రూ.10వేలు అందించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అన్వర్ పాషా, మాజీ కౌన్సిలర్ రఫీ ఖురేషి, నిజాం రజా, సయ్యద్ రహన్, సోహెల్, ఆర్గనైజేషన్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

నవతెలంగాణ-తలమడుగు

మద్యానికి బానిసై ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని బరంపూర్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... భరంపూర్ గ్రామానికి చెందిన మేకల రవీందర్ గత కొంత కాలంగా మద్యానికి బానిస కాగా, ఆరోగ్యం క్షీణించింది. ఇంట్లో ఎవరు లేని సమయంలో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ధనశ్రీ తెలిపారు.

అడవి పంది దాడిలో గాయపడ్డ రైతు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని వడ్యాల గ్రామానికి చెందిన రైతు పోతారెడ్డి బుధవారం అడవి పంది దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. తన వ్యవసాయ తోటలో పనులు చేసుకుంటున్న రైతును అడవి పంది ఆకస్మికంగా దాడి చేసి గాయపర్చింది. బాధితుడిని స్థానికుల సహాయంతో 108లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు అంబులెన్సు పైలట్ హఫీజ్, ఈఏంటి సతీష్ తెలిపారు.

వికసిత్ భారత్ పోస్టర్లు విడుదల

నవతెలంగాణ-నార్నూర్

భారతదేశాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన వికసిత్ భారత్ పోస్టర్లను మండల కేంద్రంలో బుధవారం స్థానిక సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2047 నాటికి దేశం ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు తమ వంతు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బ్రిజ్‌లాల్, మహేందర్, హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్, వైద్య సిబ్బంది లక్ష్మి, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

3
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
గురువారం | జనవరి 11, 2024 | www.navatelangana.com

జై హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని కమాన గ్రామ పంచాయతీ పరిధి లింబారావుగూడలో జై హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మూడు రోజుల కబడ్డీ పోటీలను కమాన సర్పంచ్ పెందూర్ పవన్ ప్రారంభించారు. కబడ్డీ పోటీలో మొదటి బహుమతి రూ.10 వేలు, రెండవ బహుమతి రూ.ఐదు వేలు, మూడవ బహుమతి రూ.మూడు వేలు అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం వివిధ గ్రామాల నుండి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ లింబారావు, రసూల్ బాయ్, కిషన్, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు మోర్లె హనుమంత్‌రావు, తూశం కిస్మత్‌రావు, సిడాం నరేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన రాయితీ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండలంలోని కొండపెల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన మూడు క్వింటాళ్ల రాయితీ బియ్యాన్ని బుధవారం సివిల్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా తనిఖీ చేసి పట్టుకున్నారు. కొండపెల్లి గ్రామానికి చెందిన శేఖర్ అనే వ్యక్తి అక్రమంగా తన ఇంటిలో నిల్వ ఉంచిన బియ్యాన్ని పట్టుకొన్ని స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వ్యక్తిపై కేసు నమోదుచేసినట్టు ఎస్సై కొమురయ్య తెలిపారు. రాయితీ బియ్యాన్ని అక్రమంగా నిల్వవుంచిన, విక్రయాలు జరిపిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్సై సందీప్, ఏఎస్సై ప్రభాకర్ పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని మార్కెట్ కమిటీలో బుధవారం పత్తి కొనుగోళ్లను సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీట్ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన కంప్యూటరైజ్డ్ వేబ్రిడ్జిని కాంటాను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాగజ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు నిత్యం సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఇన్‌ఛార్జి చైర్మెన్ కోనేరు కృష్ణ, మాజీ కౌన్సిలర్లు సిందం శ్రీనివాస్, దెబ్బటి శ్రీనివాస్, మహిళ మోర్చ పట్టణ అధ్యక్షురాలు చిప్ప మౌనిక, సర్పంచ్ ధోతుల శ్రీనివాస్, పిర్సింగుల తిరుపతి, పుల్ల అశోక్, లోనారే రవీందర్ పాల్గొన్నారు.

శనగ పంటను పరిశీలించిన డీఏఓ



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని సవర్గం గ్రామంలో శనగ పంటను జిల్లా వ్యవసాయాధికారి(డీఏఓ) డి.పుల్లయ్య బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగిలో శనగ పంట అత్యధికంగా పండిస్తున్నారన్నారు. శనగలో పచ్చ పురుగు, లద్దె పురుగు సోకుతుందన్నారు. దాని నివారణకు నో వేల్యూ రాన్ లేదా ఇమీ మెక్టెడ్ బెంజోమేట్ అనే మందులను పిచికారి చేసుకోవాలని సూచించారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించి శనగలో దిగుబడులు సాధించాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి భాస్కర్, ఏఈఓ జైపాల్, రైతులు నారాయణ, గంగయ్య ఉన్నారు.

మథుర లబానాలను ఎస్టీలో చేర్చాలి



నవతెలంగాణ-ఉట్నూర్

మథుర లబానలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆ సంఘం జిల్లా యువనాయకుడు గోవింద్ కోరారు. బుధవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును కలిసి వినతిపత్రం అందించారు. ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో రెండు లక్షలకు పైగా లాభన కులస్తులున్నారన్నారు. తమను ఎస్టీలో చేరుస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనైన తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. అభివృద్ధికి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సాగు చేసుకుంటున్న వారికి పోడుపట్టాలివ్వాలన్నారు. తమ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు.

గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు కల్పిస్తాం

- మండల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

నియోజకవర్గంలోని గ్రామాల్లో రోడ్డు సౌకర్యాలు కల్పించేల కృషి చేస్తానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని ఏసాపూర్ గ్రామంలో రూ. కోటితో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి మాజీ ఎంపీ గోడం నగేష్‌తో కలిసి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మోర్కండి నుండి భరంపూర్‌కు త్వరలోనే రోడ్డు సౌకర్యం కల్పిస్తామన్నారు. మండలంలోని ప్రాంతాల అభివృద్ధికి ఎల్లవేళల కృషి చేస్తానని అన్నారు. ప్రతి మారుములా గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించే విధంగా తమ వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఆదిలాబాద్-అడెల్లీ, మోర్కండి నుండి భరంపూర్ వరకు రోడ్డు త్వరలోనే మంజూరు అయ్యే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన గులాబ్ తాండా గ్రామపంచాయితీ భవనాన్ని ప్రారంభించారు.

సెలవు దినంగా ప్రకటించాలి

నవతెలంగాణ-బోథ్

సేవాలాల్ మహారాజ్ జయంతి రోజు సెలవు దినంగా ప్రకటించాలని గోర్ సేన సభ్యులు కోరారు. బుధవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను నేరడిగొండలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. ఫిబ్రవరి 15న సేవాలాల్ జయంతి సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాలో సెలవుదినంగా ప్రకటించే విధంగా కృషి చేయాలని కోరారు. సేవాలాల్ జయంతి రోజు సెలవు దినంగా ప్రకటించక పోతే రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

చదువుతో పాటు ఆరోగ్యంపై దృష్టి సారించాలి

- కలెక్టర్ హేమంత్ బొర్కాడే, ఎమ్మెల్యే హరీష్ బాబు



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బొర్కాడే, పక్కన ఎమ్మెల్యే

నవతెలంగాణ-దహెగాం

పిల్లల చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ బొర్కాడె, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో బేటీ బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన వారు క్యాంపును ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ టీనేజీ వయసులో విద్యార్థినిలో అనేక శారీరక మార్పులు చోటుచేసుకుంటాయన్నారు. అమ్మాయిలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి, ఎలాంటి ఆందోళనకు గురికావద్దని సూచించారు. ఏవైనా శారీరక ఇబ్బందులు కలిగితే వైద్యుల సూచనలు పాటించాలన్నారు. వసతి గృహాల్లోని విద్యార్థుల్లో ప్రధానంగా రక్తహీనత, ఫైలేరియా లాంటి వ్యాధులు ఎక్కువగా వస్తుంటాయని, వాటి నివారణకు విద్యార్థులకు ప్రత్యేక చికిత్సలు చేయనున్నట్టు పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి రక్తపరీక్షలు నిర్వహించి సంబంధిత వ్యాధులకు మందులు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. అలాగే పాఠశాలలో మరుగుదొడ్ల, డ్రైనేజీ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అంతకు ముందు పాఠశాలకు వచ్చిన కలెక్టర్, ఎమ్మెల్యేను కేజీబీవీ సిబ్బంది శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ తుకారాం, డిప్యూటీ డీఎంహెచ్ఓ సీతారాం, తహసీల్దార్ కవిత, ఎంపీడీఓ రాజేశ్వర్ గౌడ్, ఎంఈఓ భిక్షపతి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు స్పందన, ఆర్‌బీఎస్‌కె వైద్యులు సురేందర్, జ్యోతి, శివరంజని, ఎస్ఓ రిజ్వాన పాల్గొన్నారు.

వాంకిడి : బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని కేజీబీవీలో హెల్త్ క్యాంపును ఎంపీపీ ముండె విమలాబాయి ప్రారంభించారు. ఈ శిబిరంలో రక్త నమూనాలు సేకరించారు. విద్యార్థులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకుండా ఉండడం కోసమే ఈ హెల్త్ క్యాంపు నిర్వహించడం జరిగిందని ఎంపీపీ తెలిపారు. ముందు జాగ్రత్త చర్యగా వైద్యాధికారులు ఇలాంటి క్యాంపు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ రవిదాస్, ఎస్ఓ పద్మ, ఏఎన్ఎం గీత, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, విద్యార్థి దశలోనే అన్ని సామాజిక పరమైన అంశాలపై అవగాహన కలిగి భవిష్యత్తులో అనుభవాలను తమ జీవితంలో అనుసరించాలని, అప్పుడే తల్లిదండ్రుల కలలను నెరవేర్చడం సాధ్యమవుతుందని ఎస్సై దీకొండ రమేష్ అన్నారు. బుధవారం మండలంలోని ఈడెన్ గార్డెన్ ప్రయివేటు పాఠశాలలో యాన్వెల్ స్పోర్ట్స్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా క్రీడాజ్యోతిని వెలిగించి శాంతికి ప్రతిరూపమైన పావురాన్ని ప్రధానోపాధ్యాయుడు బైజుజాన్ ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలలో ఉన్న అంశాలనే కాకుండా తమ చుట్టూ ఉన్న పరిసరాలను ఆధ్యాయనం చేస్తూ సమాజంలో మనకంటూ ఒక వ్యక్తిని ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తులో మంచి రంగంలో ఉండాలన్నారు. నాటి కాలంలో చదువుకునే విద్యార్థులు కేవలం విద్యకే పరిమితమవుతూ వారికి ఆసక్తి కలిగిన రంగాల్లో రాణించే వారని, కానీ నేటి డిజిటల్ యుగంలో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని, దానికి అనుగుణంగా తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారని, వారి శ్రమను వృథా చేయవద్దన్నారు. అలాగే క్రీడా రంగంలో పాల్గొంటూ అంతర్జాతీయ స్థాయి వరకు ఎదగాలని, వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో కూడా క్రీడా రంగం కోటా కింద ఉద్యోగాలు సాధించాలన్నారు. కేవలం విద్యనే కాకుండా క్రీడల్లో కూడా మంచి భవిష్యత్తు ఉందన్నారు. తాము చదువుతున్న తరగతిలో ప్రథమస్థానం లక్ష్యంగా చేసుకొని తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మణ్, ఈశ్వర్, సాగర్, సుజాత పాల్గొన్నారు.



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ఎస్ఐ దీకొండ రమేష్

విభేదాలు పక్కన పెట్టి అభివృద్ధికి కృషి చేద్దాం

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

నవతెలంగాణ-దహెగాం

రాజకీయ విభేదాలను ప్రక్కకుపెట్టి కలిసికట్టుగా పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేద్దామని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి జెడ్పీ చైర్మెన్ కోనేరు కృష్ణతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. మండలంలో మొత్తం 55 పాఠశాలలకు గాను 45 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఎంఈఓ భిక్షపతి సభ దృష్టికి తీసుకొచ్చారు. ఖాళీలు ఎక్కువగా ఉన్నచోట ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై పంపించి పాఠశాలలను నడిపించాలని జెడ్పీటీసీ శ్రీరామారావు సూచించారు. దేవాజీగూడలో పాఠశాల భవనం లేక అద్దె భవనంలో పాఠశాల కొనసాగుతుందని, ప్రణాళికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాలన్నారు. అలాగే మురళీగూడ, దేవులగూడ, జెండాగూడ, కల్వాడ తాండ, చేపర్‌గాం, దేవాజీగూడ, మెత్తెం, బొప్పారం గ్రామాలకు రోడ్లు, వంతెనలు లేవని సభ దృష్టికి తీసుకువచ్చారు. వంతెనాలు, రోడ్లు లేని గ్రామాల వివరాలు, ప్రణాళికలు అందిస్తే నిర్మాణాలకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్నారు. రావులపల్లి అంగన్‌వాడీ సెంటర్ నడవడంలేదని, గిరవెల్లి, మెత్తెం సెంటర్‌లు కూడా నడవడంలేదని సర్పంచ్ వెంకటి, వైస్ ఎంపీపీ సురేష్ తెలిపారు. సివిల్ సప్లాయి విషయంలో 24 జీపీలకు 17 రేషన్ దుకాణాలు మాత్రమే ఉన్నాయని, జీపీల వారీగా దుకాణాలు పెంచాలని జెడ్పీటీసీ కోరారు. నాలుగు గ్రామాల్లో జీపీ భవనాలు, గ్రామ పంచాయతీ భవనాలు మంజూరైన స్థలాలు చూపడం లేదని పీఆర్ జేఈ ఆత్మారాం తెలపగా త్వరలోనే భూములను గుర్తిస్తామని డిప్యూటీ తహసీల్దార్ లలిత అన్నారు. పీపీరావు ప్రాజెక్టు పూడికతో నిండిపోయి ప్రాజెక్టు కెనాల్ పూర్తిగా ధ్వంసమై తాగునీరు అందడంలేదని పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాలకు రోడ్లు, వంతెనలు లేవని జెడ్పీటీసీ శ్రీరామారావు ఒక నివేదికను ఎమ్మెల్యే హరీష్‌బాబుకు అందజేశారు. వెంటనే స్పందించిన ఆయన అటవీ శాఖ అనుమతులు లేక 12 గ్రామాలకు రోడ్లు మంజూరైనప్పటికీ పనులు నిలిచిపోయాయని, వెంటనే వాటి అనుమతులు వచ్చేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే మండలంలోని ప్రతి సమస్యను సమన్వయంతో పని చేసి పరిష్కరించుకుందామన్నారు. పనిచేయని అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రాజకీయం కేవలం ఎన్నికలప్పుడు మాత్రమే ఉండాలని, ప్రజా అభివృద్ధి కోసం పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కంబగోని సులోచన, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ సిద్ధిక్, ఎంపీడీఓ రాజేశ్వర్‌గౌడ్, మిషన్ భగీరథ డీఈ సిద్ధిక్, వైస్ ఎంపీపీ చౌదరి సురేష్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులకు అధికారుల సూచనలు పాటించాలి

నవతెలంగాణ-జైనూర్

యాసంగి పంటల సాగులో రైతులు అధిక దిగుబడుల కోసం వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ అన్నారు. బుధవారం లింగాపూర్ మండలంలోని కిక్లనాయక్ తాండ గ్రామంలో పంట క్షేత్రాలను పరిశీలించారు. యాసంగిలో రెండో పంట పండిస్తున్న రైతుల చేన్లకు వెళ్లి పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి పంట పండించడంలో రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలతో సాగులో లాభాలు పొందాలని కోరారు. మండలంలో వ్యవసాయ అధికారులతో పాటు ఏఈఓలు అందుబాటులో ఉంటారని తెలిపారు. రెండో పంట పండించడంతో పాటు రైతులు భూముల్లో ఎలాంటి పంటలు సాగు చేయాలి, కావాల్సిన మందుల వివరాలను తీసుకోవాలన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే విధంగా సూచనలు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించవద్దని ఏఈఓలను ఆదేశించారు.



అనంతరం పలువురు రైతులు పండిస్తున్న యాసంగి పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

అక్రమ పెన్షన్ పొందుతున్న వ్యక్తిపై ఆధారలతో ఫిర్యాదు చేసినా కాగజ్‌నగర్ ఎంపీడీఓ చర్యలు తీసుకోలేదని ఆయనపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని మండలంలోని బారెగూడకు చెందిన కోట వేణుగోపాల్ కోరారు. బుధవారం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారికి ఇదే విషయమై ఫిర్యాదు చేశారు. బారెగూడకు చెందిన వడాయి శాంతాబాయి బారెగూడ-2 అంగన్‌వాడీ సెంటర్‌లో పది సంవత్సరాలుగా అంగన్‌వాడీ ఆయాగా విధులు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ఇదే సమయంలో ఆసరా పథకం ద్వారా పెన్షన్ పొందుతూ ప్రభుత్వాన్ని మోసం చేస్తుందన్నారు. ఈ విషయమై ఎంపీడీఓకు ఫిర్యాదు చేసిన చర్యలు చేపట్టలేదన్నారు. తగు విచారణ జరిపి ఆసరా పెన్షన్ పొందేందుకు అనర్హురాలిగా ప్రకటించి, ఉద్దేశపూర్వకం మోసం చేసినందున గతంలో పొందిన పెన్షన్ మొత్తాన్ని రికవరీ చేయాలని కోరారు.

నేటి నుంచి జైజంగో జైలింగో దీక్షలు

నవతెలంగాణ-జైనూర్

జైజంగో జైలింగో దీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నఆయని కమిటీ అధ్యక్షుడు ఆత్రం రఘునాథ్ అన్నారు. బుధవారం జంగో లింగో దీక్ష కరపత్రాలను విడుదల చేశారు. ఆదివాసులలో ఉన్న యువత, మహిళలు ఈ దీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జంగాం గ్రామంలోని దీక్షభూమి ఆలయంలో సంస్కృతి సాంప్రదాయాలతో పూజను నిర్వహించి ఆత్రం కిశన్‌రావు దీక్ష గురువు చేతుల మీదుగా జంగో లింగో దీక్షను స్వీకరిస్తారని తెలిపారు. ఈ దీక్ష కార్యక్రమానికి తెలంగాణ, మహారాష్ట్ర నుండి అధిక సంఖ్యలో భక్తులు హాజరవుతారని తెలిపారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కుమ్ర భగవంత్‌రావు పటేల్ అధిపతి, మడావి రాజేశ్వర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటలు



నవతెలంగాణ-జైనూర్

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో నిరంతర పోరాటలు చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి అన్నారు. బుధవారం లింగాపూర్ మండల నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా జాదవ్ కైలాశ్, ఉపాధ్యక్షుడిగా సాయిరాం, ప్రధాన కార్యదర్శిగా పెందూర్ ప్రవీన్ కుమార్, కోశాధికారిగా సాయినాథ్, మహిళా ఉపాధ్యక్షురాలుగా నాగమణి, కార్యదర్శులుగా సరస్వతి, మొయినొద్దీన్, నీలబిందు, రాథోడ్ శైలజను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ బాధ్యతాయుతంగా పనిచేసి సంఘాన్ని బలోపేతం చేయాలని జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి సూచించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన మండల కమిటీ సభ్యులకు శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

క్రీడా స్ఫూర్తిని చాటాలి



నవతెలంగాణ-బెజ్జూరు

పోటీల్లో క్రీడాకారులు వారిలో దాగి ఉన్న ప్రతిభను చూపుతూ క్రీడా స్ఫూర్తిని చాటాలని ఎస్సై విక్రమ్ అన్నారు. బుధవారం మండలంలోని ఎలుకపెల్లి గ్రామంలో స్వర్గీయ పాల్వాయి పురుషోత్తంరావు స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్సై ప్రారంభించారు. గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పాల్వాయి పురుషోత్తంరావు స్మారక క్రికెట్ క్రీడలను ఎలుకపెల్లిలో యువత నిర్వహించడం అభినందనీయమని ఎస్సై అన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచాయం చేసి వారితో కలిసి క్రికెట్ ఆడారు. ఈ కార్యక్రమంలో పాల్వాయి శ్రావణ్‌రావు, కోండ్ర మనోహర్ గౌడ్, భాస్కర్‌రాజు, సామల తిరుపతి, ఉమ్మెర బాలకృష్ణ, మెస్రం రాజారాం, సంతోష్, కుబిడె రాకేష్, చౌదరి కృష్ణ, పోర్తిటి రవి, జావీద్, తంగెడిపల్లి నీలేష్, అన్నారం తిరుపతి, జంగిటి సునీల్, పాడిశం కార్తీక్, మహేందర్, సురేష్, చాటారి రాజు, వశాక వెంకటేశ్, చటారి చిరంజీవి, మోర్లె వెంకటేశ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

13న కబడ్డి పోటీలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని సాకడ గ్రామంలో 13న పెందూర్ జంగు స్మారక కబడ్డీ పోటీలను నిర్వహించనున్నారు. ఈ పోటీలకు హాజరు కావాలని బుధవారం ఎంపీపీ పెందూర్ మోతీరాం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మిని కలిసి ఆహ్వానం అందించారు. ఎమ్మెల్యే కూడా సానుకూలంగా స్పందించారని ఎంపీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు పెందూర్ శ్రీనివాస్, సెడ్మాకి తుకారం పాల్గొన్నారు.

12న తుడుందెబ్బ జిల్లా కమిటీ సమావేశం

నవతెలంగాణ-వాంకిడి

12న ఆదివాసీ పోరాట సమితి తుడుం దెబ్బ జిల్లా కమిటీ అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్టు జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసిఫాబాద్ కుమురం భీం జిల్లా కేంద్రంలో జరిగే ఈ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ, ప్రణాళికను సిద్ధం చేస్తామని తెలిపారు. త్వరలోనే మండల కమిటీని ఏర్పాటు, కమిటీ బలోపేతంపై చర్చించడం జరుగుతుందన్నారు. ఆసిఫాబాద్, వాంకిడి, తిర్యాణి, రెబ్బెన మండలాలకు కమిటీని వేయనున్నట్టు పేర్కొన్నారు. జిల్లా కమిటీ సభ్యులు, నాయకులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఐదు రోజుల పాటు పత్తి కొనుగోళ్ల నిలిపివేత

నవతెలంగాణ-జైనూర్

ఐదు రోజుల పాటు పత్తి కొనుగోళ్ల నిలిపివేయడం జరుగుతుందని జైనూర్ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇర్ఫాన్ హైమద్‌ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రెండు జిన్నింగ్ మిల్లులలో కొన్ని రోజుల నుండి రైతులు పెద్దఎత్తున పత్తిని తీసుకురావడం, సంక్రాంతి సెలువులు మూడు రోజులు ఉండడంతో ఐదు రోజుల పాటు పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఐదు రోజుల తరువాత సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు జరుగుతాయని, రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

ఉట్నూర్‌కు చేరుకున్న పల్లకి

నవతెలంగాణా-ఉట్నూర్

జన్నారం నుండి కొత్తపల్లి-హెచ్ వరకు సేవాలాల్ మహారాజ్ పల్లకి పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్ర బుధువారం ఉట్నూర్‌కు చేరుకుంది. బంజారా యువసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్ చంద్రకాంత్ నాయక్ పల్లకికి స్వాగతం పలికి ప్రతేక పూజలు చేశారు. పాదయాత్ర కొత్తపల్లికి బయల్దేరింది. ఈ కార్యక్రమంలో సుధాకర్ రాథోడ్, గోకుల్ పవర్, ఆత్మరాం బానోత్, జావిందర్, విఠల్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
గురువారం | జనవరి 11, 2024 | www.navatelangana.com

రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడు మృతి

నవతెలంగాణ-మందమర్రి



మందమర్రి పట్టణంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బుధవారం మందమర్రి పాత బస్టాండ్ కూడలి ప్రధాన రహదారి మీదుగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కుంచాల ఆంజనేయులు(47)ను లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహం పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది. మృతుని గుండె శరీరం నుండి పూర్తిగా వేరై కొట్టుకోవడం అందరినీ కలచివేసింది. దీపక్‌నగర్‌కు చెందిన ఆంజనేయులు తాపీ మేస్త్రిగా పనిచేసేవారు. భవన నిర్మాణ కార్మిక సంఘం కోశాధికారిగా పనిచేస్తున్నాడు. సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై చంద్రకుమార్ ఘటన స్థలాన్ని పరిశీలించి లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

సీఏ ఫలితాల్లో సత్తాచాటిన మండల వాసి

నవతెలంగాణ-జన్నారం



సీఏ ఇంటర్ ఫైనల్ ఫలితాల్లో మండలంలోని మారుమూల గ్రామమైన దేవునిగూడా గ్రామానికి చెందిన కళ్లెం విక్రంరెడ్డి తన సత్తా చాటాడు. దేవుని గూడా గ్రామానికి చెందిన కళ్లెం లక్ష్మణ్‌రెడ్డి-రాణి, దంపతుల కుమారుడు విక్రమ్‌రెడ్డి స్థానిక కార్మెల్ స్కూల్‌లో ప్రాథమిక విద్య, సీఎంఎస్ ఇంటర్ కాలేజీల్లో, ఇంటర్ పూర్తి చేశాడు. సీఏ గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షల్లో విక్రమ్‌రెడ్డి అత్యుత్తమ మార్కులు సాధించాడు. సీఏ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, స్థానికులు అభినందించారు.

సంత్ సేవాలాల్ మహాపాదయాత్ర



నవతెలంగాణ-జన్నారం

లంబాడాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ పాదయాత్ర బుధవారం మండల కేంద్రం నుంచి ఆదిలాబాద్ జిల్లాలోని నార్నూర్ మండలం కొత్తపల్లి గ్రామం వరకు నిర్వహిస్తున్నట్లు సేవాలాల్ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మహా పాదయాత్ర మొత్తం 80 కిలోమీటర్లు కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు సందేశ్ నాయక్ మాట్లాడుతూ బంజారా సమాజంలో ధర్మాన్ని, సంస్కృతి సాంప్రదాయాలను కాపాడడానికి బంజారా జగత్ గురు శ్రీ సంత్ సేవా లాల్ మహారాజ్, ధర్మ గురు మాహన్ తపస్వీ రామారావు మహారాజ్ ఆశీర్వాదంతో ప్రతి సంవత్సరం జనవరి 11వ తేదీన జన్నారం నుంచి, కొత్తపల్లి వరకు ఈ మహా పాదయాత్ర నిర్వహించి అక్కడి ఆశ్రమానికి చేరుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంత్ సేవాలాల్ ఉత్సవ కమిటీ సభ్యులు రాజు నాయక్, రాములు నాయక్, భోజ్జ నయక్, భూక్యా నాయక్, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

డీడీలు కట్టిన వారికి గొర్రెల యూనిట్ పంపిణీ చేయాలి



నవతెలంగాణ-జన్నారం

గొర్రెల యునిట్ కోసం డీడీలు కట్టిన యాదవులకు రెండవ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాలని యాదవ సంఘం మండల అధ్యక్షుడు తిరుపతి యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని యాదవ సంఘం భవనంలో మండల తహసీల్దార్ వేణుగోపాల్ ఎంపీడీఓ అరుణ రాణి చేతులమీదుగా మండల యాదవ సంఘం క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న పేద యాదవులను గుర్తించి వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయాలని కోరారు. ప్రతి యాదవునికి యాదవ సంఘం అండగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం ఉపాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, బైరి తిరుపతి ప్రధాన కార్యదర్శి అంజిత్ యాదవ్, డైరెక్టర్లు గట్టు మహేష్ యాదవ్, పిండి నరేష్ యాదవ్, నాయకులు సురక్షణ్ యాదవ్, రాజశేఖర్ గోపాల్ పాల్గొన్నారు.

బారేపల్లిలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహనా కార్యక్రమం



నవతెలంగాణ-తాండూర్

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రేచిని శాఖ వారి ఆధ్వర్యంలో బుధవారం బారేపల్లి గ్రామములో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ఎంవీ రూరల్ ఫోక్ ఆర్ట్స్ ఆర్గనైజేషన్ కర్నూల్ బృందం కళాకారులు బ్యాంకు పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రుణమాఫీ సామాజిక భద్రత బీమా పథకాలైన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ప్రధానమంత్రి జీవనజ్యోతి యోజన అటల్ పెన్షన్ యోజన గురించి తెలిపారు. నగదురహిత లావాదేవీలపై సైబర్ మోసాలపై ప్రజలకు అర్థమయ్యేలా ఆటపాటలు నృత్య రూపకాల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ జి.రాజేందర్, మసెంట్రల్ ఫర్ ఫైనాన్షియల్ లిటిల్ రాసి ఎన్నం అశోక్, రవి, కళాజాత బృందం సభ్యులు మెజీషియన్ ఎం తేజ కుమార్, డప్పు ప్లేయర్ వేణు పాల్గొన్నారు.

ఆదివాసీ సేన గ్రామ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కవ్వాల్ అనుబంధ పాలగోరి గ్రామ ఆదివాసీ సేన నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సిడాం మోతిరామ్, ఉపాధ్యక్షులుగా కుమ్ర లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా ఆత్రం జ్యోతిరాం, కోశాధికారిగా తొడసం సీతారాం ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఆదివాసీ సేన ప్రముఖులు సోనేరావు, దుర్వ యశ్వంతరావు, ఆత్రం రాజు, మాన్కు మారు జంగు పాల్గొన్నారు.

ఆర్కే-న్యూటెక్ గనిపై రక్షణపై అవగాహన

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-న్యూటెక్ గనిపై గనుల్లో పాటించాల్సిన రక్షణ సూత్రాలు, తీసుకోవల్సిన జాగ్రత్తలపై బెల్లంపల్లి రీజియన్ జీఎం(రక్షణ) కె.హరినారాయణ గుప్తా అవగాహన కల్పించారు. బుధవారం గని ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులందరికీ గనుల్లో జరిగే ప్రమాదాలపై పూర్తి అవగాహన ఉండాలని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రతిఒక్కరూ తప్పకుండా వ్యక్తిగత రక్షణ పరికరాలు ధరించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మానవ ప్రమేయ ప్రమాదాలను తగ్గించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. అనంతరం ఉద్యోగులతో కలసి రక్షణ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రూపు ఏజెంట్ మాలోత్ రాముడు, గని ఎస్‌ఓఎం స్వామిరాజు, రక్షణాధికారి కొట్టె రమేష్, సంక్షేమాధికారి పాల్ స్రుజన్, ఇంజినీర్ కృష్ణ, వెంటిలేషన్ అధికారి చంద్రమౌళి, సర్వే అధికారి పిచ్చేశ్వర్‌రావు పాల్గొన్నారు.

అంధుల్లో వెలుగు నింపిన 'లూయిస్ బ్రెయిలీ'

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్



అంధుల కోసం లిపిని సృష్టించి అంధుల జీవితంలో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్త్రీ, శిశ, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన లూయిస్ బ్రెయిలీ 215వ జయంతి వేడుకలలో జిల్లా సంక్షేమశాఖ అధికారి కె.చిన్నయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి.శేషాద్రితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంధులు సామాన్యులతో సమానంగా అన్ని రంగాలలో ముందుండేలా ఆలోచించి లూయిస్ బ్రెయిలీ ఆరు చుక్కలతో కూడిన లిపిని తయారు చేయడం జరిగిందని, ఈ కారణంగా నేటి ప్రపంచంలో 4వ తరగతి ఉద్యోగ స్థాయి నుంచి అత్యున్నత స్థాయి వరకు అన్ని రంగాలలో అంధులు రాణిస్తున్నారని, ఈ నేపథ్యంలో తన బ్యాచ్‌లో అజయ్ అరోరా ఐఎఎస్ ఉన్నారని గుర్తు చేసుకున్నారు. తాను పడిన ఇబ్బంది వేరెవరూ పడకూడదనే ఉద్దేశ్యంతో భవిష్యత్తు పరిణామాలను ఆలోచించి బ్రెయిలీ లిపిని సృష్టించి అంధుల జీవితాలలో వెలుగులు నింపారని తెలిపారు. నిరుద్యోగ అంధుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, బ్యాంకర్ల సమన్వయంతో రుణ సదుపాయం కల్పించి ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ప్రోత్సహించడం జరుగుతుందని అన్నారు. అంధ దివ్యాంగులకు బ్రెయిలీ పుస్తకాలు, ఉపకరణాలు అందించేందుకు దిశగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. అనంతరం బ్రెయిలి క్యాలెండర్ ఆవిష్కరించి, కేక్ కట్ చేసి అంధులకు శాలువాలతో సత్కరించి, ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎల్ఐసీలో వేతన సవరణ వెంటనే చేపట్టాలి

- దేశవ్యాప్త సమ్మెలో మంచిర్యాల బీమా ఉద్యోగులు



నవతెలంగాణ-హాజీపూర్

ఎల్ఐసీ సంస్థలో పదిహేడు నెలలుగా పెండింగులో ఉన్న వేతన సవరణను సత్వరం చేపట్టాలని ఇన్సూరెన్స్ జేఏసీ నాయకులు డిమాండు చేశారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం మంచిర్యాల బీమా ఉద్యోగులు, అధికారులు విధులను బహిష్కరించి కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. లాభాలనార్జిస్తున్న ప్రభుత్వరంగ సంస్థలో వేతన సవరణ ఆలస్యం చేయడం అన్యాయమని అన్నారు. సంస్థలోని ఉద్యోగులు అధికారులు ఇతోధికంగా శ్రమించిన కారణంగానే సంస్థ అభివృద్ధి బాటలో నడుస్తోందని, తమకు దక్కాల్సిన న్యాయమైన వాటాను వేతన సవరణ రూపంలో ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. బ్యాంకులు ఇతర సంస్థల్లో వేతన సవరణ ఎప్పుడో పూర్తయిందని, ఎల్ఐసీలో ఇక ఆలస్యం చేయడం తగదని అన్నారు. యాజమాన్యం సత్వరమే చర్చలు చేపట్టి వేతన సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జాయింట్ ఫ్రంట్ కమిటీ ఆధ్వర్యంలో ఐక్య పోరాటాలకు ఉద్యోగులు అధికారులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం జరుగుతున్న పోరాటమని, ప్రజలు అండగా నిలబడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ అధికారుల సంఘం నాయకులు మాలతీదేవి, సీరాపాణి, వికాసాధికారుల సంఘం నాయకులు సతీష్ కుమార్, ప్రవీణ్, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జి.రమేష్ బాబు, మోర చరణ్, ఎం.రాందాసు, ఆర్.రాజేశం, జగదీష్, మనోజ్ కుమార్, సురేష్, సమత్ కుమార్, తిరుపతిరెడ్డి, ఫణి రామ్మోహన్, నరేష్, సుష్మ, సోనీ, శైలజ, సౌమ్య, హిమశ్రీ, మౌనిక, శ్రీనివాస్, గోపి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

నవతెలంగాణ-తాండూర్



పరిమితికి మించిన వేగం ప్రమాదకరమని డ్రైవర్లు నియంత్రిత వేగంతో వాహనాలను నడపాలని తాండూర్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం విద్యా భారతి విద్యాసంస్థలు ప్రయివేటు పాఠశాలలకు చెందిన బస్సు డ్రైవర్లకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. రెబ్బెన మండలం విద్యానగర్ వద్ద జరిగిన స్కూల్ పిల్లల బస్సు ప్రమాదం దృశ్య విద్యా భారతి విద్యాసంస్థల డైరెక్టర్ శరత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఐ మాట్లాడారు. కొత్తగా నిర్మాణమైన జాతీయ రహదారిపై జాగ్రత్తగా బస్సులను నడపాలని తెలిపారు. బస్సు డ్రైవర్లు తమతో పాటు భవిష్యత్ తరాలకు చెందిన చిన్నారులు ప్రయాణిస్తున్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రహదారిపై ఏర్పాటు చేసిన సూచికలను అనుసరిస్తూ డ్రైవింగ్ చేయాలన్నారు. గమ్యాలను చేరుకునే ఆతృతతో రాంగ్ రూట్ డ్రయివింగ్ చేయరాదన్నారు. స్కూల్ పిల్లలను ఎక్కించి దించేప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ మార్గాలను వివరించారు. ప్రయివేట్ బస్సుల కండిషన్‌చ డ్రైవర్ల లైసెన్సులను బస్సులకు డ్రైవర్లకు చెందిన అన్ని రకాల పత్రాలను పరిశీలించారు.

నిరుద్యోగుల ఆర్థికాభివృద్ధికి ప్రోత్సహించాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్



ఆర్థికంగా అభివద్ధి చెందేలా జిల్లాలోని నిరుద్యోగ యువతను ప్రోత్సహించడంతో పాటు జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నూతన శాఖను బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మహేష్ నాయుడు, వైస్ ప్రెసిడెంట్ నాగేశ్వరావు, శాఖ మేనేజర్ ఒమర్ ఫరూఖీ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎన్నో విదాల సేవలతో విద్యార్థులు, పారిశ్రామిక వేత్తలు, రైతులకు రుణ సదుపాయం కల్పిస్తూ ఆర్థిక చేయూత అందించడంతో పాటు బ్యాంకింగ్ రంగంలో విశిష్ట సేవలు అందిస్తుందని, నస్పూర్లో శాఖను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. జిల్లాలో నిరుద్యోగ యువత, పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహిస్తూ జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ఈ శాఖతో కలిపి 6 శాఖలు ఉన్నాయని, మంచిర్యాల పరిధిలో 3 శాఖలతో సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా అల్ఫోన్సా పాఠశాల వార్షికోత్సవం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని స్థానిక అల్ఫోన్సా కాన్వెంట్ పాఠశాలలో బుధవారం ఆ పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బెల్లంపల్లి ఏసీపీ సదయ్య, ఎంఈఓ పోచయ్య హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలలో రానించాలని విద్యార్థుల చదువు విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని, విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా చదువు పై దృష్టి పెట్టి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. విద్యార్థులు సోషల్ మీడియాకు బానిసలు కాకుండా తగు జాగ్రత్తతో వ్యవహరించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బెస్సి, మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, రామకృష్ణాపూర్ ఎస్సై రాజశేఖర్, సిస్టర్ అల్ఫోన్సా అబ్రహం రోసిన్, ఫాథర్ బినోయ్ పాల్గొన్నారు.

సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లపై జీఎం సమీక్షా సమావేశం



నవతెలంగాణ-మందమర్రి

సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లపై అధికారులతో జీఎం సమావేశం. మందమర్రి ఏరియా జీఎం కార్యాలయంలో జీఎం మనోహర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో ఫిబ్రవరి 21 నుండి ఫిబ్రవరి 24 వరకు ఆర్కే-1 ఏ పాలవాగు వద్ద నిర్వహించబోయే సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను డిపార్ట్మెంట్ల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం జాతర లో తీసుకోవలసిన జాగ్రత్తలు సూచనలు అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం ఏ రాజేశ్వర్ రెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, గుర్తింపు సంఘం నాయకులు సలేంద్ర సత్యనారాయణ, అక్బర్ అలీ, దాగం మల్లేష్, ఉన్నత అధికారులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతిలో 100 సీట్లతో పాటు 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. జనవరి 12 నుంచి, ఫిబ్రవరి 22వ తేది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందన్నారు. ఏప్రిల్ 1వ తేది నుంచి హాల్ టికెట్ల డౌన్ లోడ్ చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 7వ తేదీన ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సంఘమిత్ర ఆధ్వర్యంలో ధ్యాన శిక్షణ

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి సంఘమిత్ర ధ్యాన మందిరం పిరమిడ్‌లో గురువారం సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు అమావాస్య సామూహిక ధ్యాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాస్టర్ ఏలేటి లక్ష్మణ్ తెలిపారు. అనంతరం సీనియర్ పిరమిడ్ గోదావరిఖని మాస్టర్ రత్నమాలచే శిక్షణ తరగతులు నిర్వహింస్తున్నట్లు తెలిపారు. సామూహిక అమావాస్య ధ్యానం కార్యక్రమంలో ప్రతి ఒక్క మాస్టరు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కొత్తగా ధ్యానంలోకి రావాలనుకునేవారు ఏలేటి లక్ష్మణ్ సెల్ 8500745119 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు


అక్రమంగా బండను తరలిస్తున్న ట్రాక్టర్ల అడ్డగింత

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని రొట్టెపల్లి గ్రామ పంచాయతీ శివారులోని నర్సింగరావు చెరువు సమీపంలో ఉన్న గుట్టలను తవ్వి అక్రమంగా ట్రాక్టర్లలో బండను తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. ఏజన్సీ గ్రామంలో గుట్టలను తవ్వద్దని ఎన్ని సార్లు చెప్పిన గుట్టలను తవ్వి బండను తరలిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫోన్ చేయగా మరో సారి రామంటే ఒదిలేయాలని, లేదంటే పట్టుకొని గ్రామ పంచాయతీలో పెడితే చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ విషయమై మైనింగ్ అధికారులకు ఫోన్ చేయగా తమ పరిధి కాదని, ఫారెస్ట్ పరిధి అంటూ ఫోన్ పెట్టి మళ్లీ ఫోన్ లిఫ్ట్ చేయలేదన్నారు. ఏజన్సీ ఏరియాలో అక్రమంగా గుట్టలను తవ్వి బండను తరలిస్తున్న మాఫియాపై చర్యలు తీసుకోవాలని లేదంటే ఆందోళనలు చేస్తామని ఆదివాసీ గిరిజన గ్రామస్తులు స్పష్టం చేశారు.

పగలే వెలుగులు..పట్టించుకునేదెవరు?

నవతెలంగాణ-నస్పూర్



సింగరేణి అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పట్టపగలే విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి. సింగరేణి యాజమాన్యం శిక్షణ కార్మికుల వసతి కల్పించడానికి జీటి హాస్టల్‌ను ఏర్పాటు చేశారు. ఈ జీటి హాస్టల్‌లో గత కొద్ది రోజులుగా విద్యుత్ దీపాలు నిత్యం వెలుగుతూ ఉండటంతో అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతుండడంతో విద్యుత్ వృధా అవుతుందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ వృధా కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఉద్యోగులకు ఉద్యోగోన్నతి పత్రాల అందజేత

నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేటగనిపై ఉద్యోగులకు ఎస్ఎల్పీ సర్వీస్ లింకుడ్ ప్రమోషన్ ద్వారా 29 మంది ఉద్యోగులకు ఉద్యోగొన్నతి పత్రాలను గని మేనేజర్ అల్లావుద్దీన్ చేతుల మీదుగా అందించారు. ప్రమోషన్ పొందిన ఉద్యోగులు క్రమ శిక్షణతో వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని, రక్షణలో పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సీనియర్ నాయకులు చిప్ప నర్సయ్య, బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, ఫిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మీనారాయణ, రక్షణాధికారి సునీల్ కుమార్, ఇంజనీర్ బాబు, అండర్ మేనేజర్ నిఖిల్, సంక్షేమాధికారి మీర్జా గౌస్, జీషాన్, అసిస్టెంట్ పిట్ సెక్రెటరీ రాజేందర్ పాల్గొన్నారు.

నేడు ఒడ్డె ఓబన్న జయంతి

నవతెలంగాణ-నస్పూర్

ఒడ్డె ఓబన్న 208వ జయంతి వేడుకలను గురువారం కలెక్టర్ కార్యాలయం సముదాయంలో ఉదయం 10:30 గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృధి అధికారి బి.వినోద్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేడుకలకు అధికారులు, బీసీ సంఘాల నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఎన్నికల్లో పోటీకి కార్యాచరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్‌కు చెందిన ఆదివాసీ బిడ్డ శ్రీలేఖ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే ఆశావాహుల్లో ఒకరు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలోని ఓ ప్రయివేట్ పాఠశాలల్లో ఎన్నికల్లో పోటీ చేసేందుకు తన కార్యాచరణను గోమాత పూజతో ప్రారంభించారు. ఈ సందర్భంగా గోమాత సేవ ఫౌండేషన్ అధ్యక్షులు సురేష్‌ను సభ్యుల కాళ్లకు పాలాభిషేకం చేశారు. అనంతరం వారిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీలేఖ మాట్లాడుతూ గోవులను రక్షించడం అంటే ప్రకృతిలోని ఎన్నో ప్రాణాలు జీవం పోసినట్లేనని తెలిపారు. గోమాత సేవా సభ్యులు చేసే ఏ కార్యక్రమానికైనా భవిష్యత్తులో ఎల్లవేళలా తన వంతు సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ అవకాశం గోమాత సభ్యులు కల్పించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడలతో పాటు చదువుల్లో రాణించాలి

నవతెలంగాణ-బోథ్



క్రీడలతో పాటు చదువుల్లో రాణించాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని పొచ్చెర సెయింట్ థామస్ పాఠశాల స్పోర్ట్స్ మీట్‌లో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు మంచి చదువులు చదివి ఉద్యోగాలు పొందాలని సూచించారు. విద్యార్థులు క్రీడలతో పాటు చదువుల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సంధ్యారాణి, మార్కెట్ కమిటీ చైర్మెన్ రుక్మాన్ సింగ్, సర్పంచులు బురుగు మల్లేష్, సురేందర్ యాదవ్, చెట్లపల్లి సదానందం, శ్రీధర్ రెడ్డి, మండల కన్వీనర్ నారాయణరెడ్డి, నాయకులు రామేల్లి శంకర్, రమణ గౌడ్, రాయల్, డాక్టర్ స్వామి, సోమన్న, రాజన్న, సుధీర్ రెడ్డి, బద్దం శ్రీనివాస్ రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అవసరం



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

ఆధునిక ప్రపంచంలో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరముంటుందని ఎమ్మెల్యే అనిల్ యాదవ్, మాజీ ఎంపీ గోడం నగేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ విద్యను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య జెడ్పీ నిధుల నుండి రూ. 2 లక్షలు మంజూరు చేసి పాఠశాలలో విద్యార్థులకు కంప్యూటర్ విద్యను బోధించాలనే ఉద్దేశ్యంతో కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడాలంటే సాంకేతిక పరిజ్ఞానం అవసరమవుతుందన్నారు. నేటి సమాజంలో చదువుతో పాటే సాంకేతిక పరిజ్ఞానం కూడా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ



నవతెలంగాణ-బోథ్

మండలంలోని సోనాల గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో బుధవారం పూలే వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురుకుల పోటీ పరీక్షల మెటీరియల్‌ను పంపిణీ చేశారు. నాల్గవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మేటిరయల్ పంపిణీ చేస్తున్నమని పూలే వెల్ఫేర్ సొసైటీ చైర్మెన్ గాజుల పోతన్న తెలిపారు. పూలే దంపతులు చదువు కోసం అహర్నిశలు కష్టపడి ఎంతో మందికి విద్యను అందించారన్నారు. వారి స్ఫూర్తితో విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అనంతరం సోనాల గ్రామానికి చెందిన భగత్ రాము కూతురు గ్రామంలోని మొట్టమొదటి మహిళా పోలీస్ కానిస్టేబుల్ ఎంపిక కావడంతో ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమం నాయకులు రమేష్ బత్తుల, తుమ్మ శ్రీధర్, సాయి కృష్ణ, అమృత్ రావు పాటిల్, కొల్హారి అనిల్, కసిరి పోతన్న, బాశెట్టి రమేష్, విజయ్ భాస్కర్ రెడ్డి, భగత్ ప్రవీణ్,ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు దినేష్, ముఖ్య సభ్యులు సోన్న హరీష్, ఏఈఓ ప్రవీణ్, పాల్గొన్నారు

ఎంపీ సోయం తీరుపై బీజేపీ నాయకుల ఆగ్రహం



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు సోయం బాపురావు తీరు బీజేపీకి నష్టం కలిగించేలా ఉందని, ఆ పార్టీ నాయకులు ఆరోపించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎంపీ సోయం బాపురావు ఖానాపూర్‌లోని అయ్యప్ప ఆలయానికి రూ.5లక్షల నిధులకు సంబంధించి ప్రొసీడింగ్ ఇచ్చి వెళ్లారని తెలిపారు. సదరు విషయాన్ని బీజేపీ కన్వీనర్, మండ పార్టీ, పట్టణ అధ్యక్షునిగా గాని కనీసం పార్టీ కార్యకర్తలకైనా సమాచారం ఇవ్వకుండా ప్రయివేట్ వ్యక్తులతో కార్యక్రమం నిర్వహించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ అభివృద్ధికి నిధులను కేటాయించడం తమకు సంతోషమే కాని, సోయం బాపురావు ఒంటెద్దు పోకడను తాము సహించమని అన్నారు. పార్టీ అభివృద్ధికోసం పని చేయాల్సిన ఎంపీ పార్టీలో విభేదాలు ఏర్పడేలా చేయడం తగదన్నారు. ఎంపీ తీరుపై రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఎ.మహేందర్, పట్టణ అధ్యక్షుడు నాయిని సంతోష్, కో కన్వీనర్ రవీందర్‌రెడ్డి, పార్టీ నాయకులు పుప్పాల ఉపేందర్, దాసరి శ్రీనివాస్, తోకల బుచ్చన్న, డి.మల్లయ్య అనీల్‌రావు, పిట్టల భూమన్న ఎనగందుల రవి, కంతి లింబాద్రి, బెజ్జారపు రాజేశ్వర్, సల్కం వెంకటేష్ ఉన్నారు.

రైతులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి



నవతెలంగాణ-దిలావర్‌పూర్

రైతులపై వేసిన అక్రమ కేసులు ఎత్తివేయాలని మంత్రి సీతక్కకు బుధవారం దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామస్తులు, రైతులు వినతిపత్రం అందజేశారు. జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రికి ఆర్ అండ్ బీ వసతి గృహం వద్ద నిర్మల్ డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు ఘన స్వాగతం పలికారు. అనంతరం దిలావర్‌పూర్, గుండంపల్లి రైతులు మాట్లాడారు. వ్యవసాయ భూముల్లో నిర్మిస్తున్న ఫ్యాక్టరీ అనుమతి పత్రాలు నిరాధారమైనవని, గ్రామానికి అతి సమీపంలో గోదావరి నదీ తీరంలో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీతో తీవ్ర కాలుష్య ప్రభావం ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాడుతున్న రైతులపై పోలీసులు అక్రమంగా కేసులు నమోదు చేసిన కేసులు వెంటనే ప్రభుత్వంచే రద్దు చేయించి, ఫ్యాక్టరీ పనులు నిలిపివేయాలని కోరారు.

సదర్‌మాట్‌కు పూర్తిస్థాయిలో నీరు అందిస్తాం

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క



వివరాలు తెలుసుకుంటున్న మంత్రి సీతక్క

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఖానాపూర్, కడెం మండలాల రైతులకు ఆధారమైన సదర్‌మాట్ ఆయకట్టుకు ఈ రబీ పంటకోసం పూర్తిస్థాయిలో సాగు నీటిని విడుదల చేసేందుకు కృషి చేస్తానని మంత్రి సీతక్క అన్నారు. బుధవారం ఆమె సదర్‌మాట్ ఆనకట్టను సందర్శించారు. ఆనకట్టలో నిల్వ ఉన్న నీటి నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయకట్టుకు రబీ నీటి విషయంలో ఎస్సారెస్పీ అధికారులు ముందుగా సాధ్యా సాధ్యాలను పరిశీలన చేసి, నిర్ణయం తీసుకుంటే బాగుండేదని అన్నారు. సదర్‌మాట్ ఆయకట్టుకు ముందస్తు ప్రణాళిక లేకుండా నీటిని వదిలి రైతులను అయోమయానికి గురిచేయడాన్ని ఆమె తప్పుబట్టారు. రైతులు రబీకి అవసరమైన అన్నీ ఏర్పాట్లు చేసుకున్న తరుణంలో నీరును వదలక పోవడం సరైంది కాదన్నారు. 13 వేల ఎకరాలకు నీరు అందేలా చూడాలని ఆమె నీటి పారుదలశాఖ అధికారులను ఆదేశించారు. ఈ ఆయకట్టు సాగు నీటి విషయాన్ని నీటి పారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్, ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జాను కలిసి వివరిస్తానని తెలిపారు. ఆయకట్టు రైతులకు ఎలాగైనా నీరు అంధించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్సారెస్పీ సీఈ శ్రీనివాస్, ఎస్ఈ సుశీల్ కుమార్, ఈఈ రామారావు, నాయకులు జంగిల్ శంకర్, మాజిద్, చిన్నం సత్యం, ఎండీ జావేద్ పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి

- బస్టాండ్‌లో ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్ల ఆందోళన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్ల సంఘం సలహాదారుడు మజీద్ డిమాండ్ చేశారు. బుధవారం కేంద్రం నిర్ణయానికి వ్యతిరేకంగా అద్దె బస్సు డ్రైవర్లు విధులు బహిష్కరించి, ఆందోళన చేపట్టారు. బస్సులను బస్టాండ్‌లో నిలిపి వేయడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తాయి. ప్రభుత్వం చట్టాన్ని రద్దు చేసేంత వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్ల సంఘం సలహాదారుడు మజీద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం హిట్ అండ్ చట్టం పేరుతో డ్రైవర్లకు పదేండ్ల జైలు, ఏడు లక్షల జరిమాన విధించడం అమానుషమన్నారు. డ్రైవర్‌పై అకారణంగా చేయిచేసుకున్న వారిని శిక్షించేలా చట్టం చేయాలన్నారు. చట్టాన్ని రద్దు చేసేంత వరకు తాము బస్సులను తీయబోమని, తమకు యాజమనులు సహకారం అందిస్తున్నారని తెలిపారు.



డ్రైవర్ల ఆందోళనతో నిలిచిన అద్దె బస్సులు

కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అద్దె బస్సు డ్రైవర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్సూర్, సాయి కుమార్, మురళిధర్, అనిల్, గజానంద్, తనాజీ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆరెల్లి మల్లేష్

నవతెలంగాణ- ఆదిలాబాద్ అర్బన్

ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవడంలో జిల్లా అధికారులు విఫలమయ్యారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ ఆరోపించారు. బుధవారం స్థానిక ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆడపిల్లలను పాఠశాలలకు పంపించాలంటే ఉలిక్కిపడేలా చేసిన ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్ యాజమాన్యంపై ఇంకా చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని ధ్వజమెత్తారు. ఇటీవల మావల మండల పరిధిలో ఎస్ఆర్ ప్రైమ్ ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రావు దళిత సామాజిక వర్గానికి చెందిన పదో తరగతి విద్యార్థినిని లైంగికంగా వేధించడంతో అమ్మాయి పోలీసులను ఆశ్రయించిందని గుర్తు చేశారు. తక్షణమే స్పందించిన పోలీసు యంత్రాంగం విచారణ చేపట్టి సదరు ప్రిన్సిపాల్ పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్, పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసి రిమాండ్ చేయడం జరిగిందని వివరించారు. చాలామంది విద్యార్థినులు లైంగిక వేధింపులకు గురయ్యారని ఈ వేధింపులు గత ఆరు నెలల నుంచి పాఠశాలలో జరుగుతున్న నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, స్కూల్ యాజమాన్యం పట్టించుకోలేదని మండిపడ్డారు. స్కూల్ ప్రిన్సిపల్ వైఖరిని పట్టించుకోని స్కూల్ యజమాన్యంపై తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారిని డిమాండ్ చేశారు. వెంటనే పాఠశాల అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆడపిల్లలకు భద్రతలేని సదరు పాఠశాలలో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించకూడదని హితవు పలికారు. స్కూలు అనుమతులను రద్దు చేయాలని, లేనిపక్షంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు మోడీపెల్లి మనోజ్, కొమ్ము కిరణ్, బొల్లెనవార్ వెంకటేష్, సంగర్తి గణేష్, సురిగిరి అశోక్ పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

జీవిత బీమా సంస్థ ఆదిలాబాద్ శాఖ కార్యాలయం ఆవరణలో బుధవారం అధికారులు ఉద్యోగులు ఎల్ఐసీ జాయింట్ ఫ్రంట్ ఆధ్వర్యంలో తమ డిమాండ్లను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ ఒక గంట బోజన విరామ సమయంలో సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ ఫ్రంట్ ఆదిలాబాద్ శాఖ ఉద్యోగుల కన్వీనర్ దౌలత్‌రావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో యాజమాన్యం చూపిస్తున్న మొండి వైఖరిని ఆయన తప్పుబట్టారు. వెంటనే వేతన సవరణ చర్చలు ప్రారంభించాలని అన్నారు. నూతన పెన్షన్ పథకం అమలు అవుతున్న ఉద్యోగులకు యాజమాన్యం చెల్లించే కాంట్రిబ్యూషన్ 10 నుంచి 14 శాతానికి పెంచాలని అన్నారు. అన్ని క్యాడర్లలో నియామకాలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారుల సంఘం నాయకులు కృష్ణ, శ్యాంరావు, సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎవీఎస్ సుధాకర్, వికాశాధికారుల సంఘం నాయకులు భాస్కర్, నవీన్ కుమార్, రవి కిరణ్, రామకృష్ణ, సుమన్, ఉద్యోగ సంఘాల నాయకులు గణేష్ నసీరుద్దీన్, చంద్రశేఖర్, నీలానంద్, జగదీశ్వర్, సుమంత్, శ్రీనాథ్, సాయి కృష్ణ, ఫహీం సిద్ధిక్, శ్రీరాం, శ్రీధర్ పాల్గొన్నారు.



కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఎల్ఐసీ ఉద్యోగులు

రెండు పంటలకు నీరందించేందుకు ప్రాజెక్టును తీర్చిదిద్దుతాం



వివరాలు తెలుసుకుంటున్న మంత్రి సీతక్క

నవతెలంగాణ-కడెం

రైతులకు రెండు పంటలకు సాగునీరు అందేవిధంగా కడెం ప్రాజెక్టును తీర్చిదిద్దుతామని మంత్రి సీతక్క అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కడెం ప్రాజెక్టును రాష్ట్ర మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌తో కలిసి సందర్శించారు. కడెం ప్రాజెక్టు పరిస్థితుల గురించి కడెం ప్రాజెక్టు అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కడెం ప్రాజెక్టు ప్రధాన గేట్లను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుతం రూ.5కోట్లతో కడెం ప్రాజెక్టుకు తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కడెం ప్రాజెక్టుకు సంబంధించి, పూర్తిస్థాయిలో త్వరలో ఎస్టిమేషన్ వేసి సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లి, రైతులకు రెండు పంటల సాగుకు నీరు అందే విధంగా కడెం ప్రాజెక్టును తీర్చిదిద్దుతామని తెలిపారు. గతంలో ఉన్న ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే కడెం ప్రాజెక్టుకు ఈ పరిస్థితి ఎదురైందని అన్నారు. ఈ ఒక్క సంవత్సరం కడెం ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు క్రాఫ్ హాలిడేగా ప్రకటించామని తాత్కాలిక మరమ్మతులు త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు, కడెం మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కను సన్మానించిన మండల నాయకులు

నవతెలంగాణ-ముధోల్

జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పంచాయత్ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జీ మంత్రి ధనసరి అనసూయ సీతక్కను ముధోల్ కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. బుధవారం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రిని ముధోల్ మండల కాంగ్రెస్ ఇన్‌చార్జ్ గంగారెడ్డితో పాటు నాయకులు శ్రీనివాస్ సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటు మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్దరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రైల్వే ఉద్యోగులకు నూతన పెన్షన్ విదానాన్ని రద్దు చేసి, పాత విధానాన్ని కొనసాగించాలని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘం కార్యదర్శి కరుణాకర్ అన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలనే డిమాండ్‌తో బుధవారం రైల్వే స్టేషన్‌లో ఒక్క రోజు నిరవధిక దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ కార్యదర్శి కరుణకర్ మాట్లాడుతూ రైల్వేలో వివిధ క్యాడర్‌లో పని చేస్తున్న నూతన పెన్షన్ అమలు చేసేలా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. రిటైర్‌మెంట్ తరువాత పెన్షన్ లేకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారుతుందన్నారు. ఉద్యోగుల ఇబ్బందులను గుర్తించి పాత పెన్షన్ విదానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జాతీయ కమిటీ పిలుపు మేరకు ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ్ చైర్మెన్ బి. నితిష్, వైస్ చైర్మెన్ రాహుల్ కాడే, గురుదీప్ సింగ్, నితీష్, అకాష్, నర్సింగ్, అజయ్, అంజాద్ పాల్గొన్నారు.

ఘనంగా వివేకానందుని జయంతి వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

స్వామి వివేకానందుని జయంతి వేడుకలను ఈనెల 12న నిర్వహించనున్న నేపథ్యంలో యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయంతి వేడుకలను విజయవంతం చేయాలని యువజన సంఘాల సమితి నాయకులు బాలశంకర్ కృష్ణ, ఊరే గణేష్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎలక్ట్రానిక్ మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ శిల్ప కళాకారుడు ఉరే గణేష్ రూపాకల్పనలో రెండు నెలల క్రితం పట్టణంలో 25 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో అందరిని ఆహ్వానించలేక పోయామని తెలిపారు. ఈసారి 12న ఉదయం 9 :30 గంటలకు నిర్వహించనున్న వివేకానంద జయంతి ఉత్సవానికి యువకులు, మేధావులు పెద్ద సంఖ్యలో తరలిరవాలని కోరారు. ఈ సమావేశంలో యువజన సంఘాల ప్రతినిధులు పసుపుల రాజు, కెమ శ్రీకాంత్, బోరె సురేష్, గణేష్ వర్మ, రాణాప్రతాప్, అబ్దుల్ అజీజ్, రవి కుమార్, కర్నెవార్ గణేష్, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన యువజన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా నిర్మల్ జిల్లా కేంద్రానికి వచ్చిన జిల్లా ఇన్‌చార్జీ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)ను కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బేల మండల మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, ఆదిలాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి, మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ గత పదేండ్ల తర్వాత తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టే ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రజలకు అందించడంలో యువజన కాంగ్రెస్ నాయకులు సిద్ధంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని నిరూపించాలన్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వచ్చే ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పని చేయాలని డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రజాసేవ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా బీఆర్ఎస్‌కు చెందిన పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, ఐటీడీఏ డైరెక్టర్లు దాదాపు 50 మంది కాంగ్రెస్ కండువాలు కప్పుకోనున్నట్లు పేర్కొన్నారు. నిర్మల్‌లో జరిగే సభలో మంత్రి సీతక్క, సమక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ కంది శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వారంతా పార్టీ తీర్థం పుచ్చుకోనున్నట్లు వెల్లడించారు. అనంతరం ఆదిలాబాద్ నుంచి ప్రత్యేక బస్సులో వారంతా బయలుదేరి వెళ్లారు. ఈ సమావేశంలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, గిమ్మ సంతోష్‌రావు, నాయకులు వెంకట్‌రెడ్డి, గణపతిరెడ్డి పాల్గొన్నారు.